# సీఎం రేవంత్ రెడ్డి విమానం దారి మళ్లింపు.. బెంగళూరుకు డైవర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణం కారణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న విమానాన్ని అధికారులు దారి మళ్లించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని.. జూన్ 12సాయంత్రం 6.30 గంటలకు ఇండిగో విమానంలో సీఎం రేవంత్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరారు. అయితే హైదరాబాద్ వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం ప్రతికూలంగా మారడం.. భారీ వర్షం కురవడంతో విమానం ల్యాండ్ అవ్వడానికి వీలు లేకుండా పోయింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు.. సీఎం విమానాన్ని బెంగళూరుకు డైవర్ట్ చేశారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి విమానం బెంగళూరులో సురక్షితంగా ల్యాండ్ అయింది. మరోవైపు హైదరాబాద్ మహానగరాన్ని భారీ వర్షం ముంచెత్తుతోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వాన బీభత్సం సృష్టిస్తోంది. ముఖ్యంగా... చందానగర్, మియాపూర్, జేఎన్టీయూ, కేపీహెచ్బీ, జీడిమెట్ల, సనత్నగర్, అమీర్పేట, బోరబండ, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, నాంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్ బాగ్, నారాయణగూడ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. పలుచోట్ల ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్



# హైదరాబాద్ సిటీలో దంచికొట్టిన వాన

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలో భారీవర్షం కురిసింది. శుక్రవారం (జూన్12) రాత్రి ఉరుములు, మెరుపులతో సిటీవ్యాప్తంగా జోరువాన కురవడంతో జనజీవనం స్తంభించింది. రెండు గంటలకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శంషాదబాద్ ఎయిర్ పోర్టు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విమానం ల్యాండింగ్ కు అంతరాయం ఏర్పడింది. వాతావరణ అనుకూలించకపోవడంతో ాూజ అధికారులు ఫ్లైట్ ల్యాండింగ్ కు అనుమతించలేదు. దీంతో విమానాన్ని బెంగళూరుకు దారి మళ్ళించారు. శుక్రవారం రాత్రి 9గంటలనుంచి సిటీ వ్యాప్తంగా వాన బీభత్సం సృష్టించింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మెహదీపట్నం లో భారీ వర్షం కురిసింది. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ లో ఉరుములతో కూడిన వర్షం పడింది. నిజాంపేట్ , బాచుపల్లి, ప్రగతినగర్ లో మోస్తరు వాన కురిసింది. కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ మచ్చ బొల్లారంలో వర్షం బీభత్సం సృష్టించింది. నార్సింగి, మణికొండ, పుప్పాలగూడలో వాన దంచికొట్టింది. బండ్లగూడ జాగీర్, కిస్మత్ పురా ,హిమాయత్ సాగర్ లో మోస్తరు వర్షం పడింది. నాంపల్లి, అబిడ్స, కోఠి, బషీర్ బాగ్ లో ఈదురుగాలులతో కూడిన వాన పడింది. భారీ వర్షం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.






# మేడ్చల్‌లో దోపిడీ ముఠా అరెస్ట్

- సీసీకెమెరాల ఆధారాలతో నిందితులను గుర్తించిన పోలీసులు..!
- ఒక నిందితుడు అరెస్ట్ కాగా.. మరొకరు పరారీ..
- మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పత్రికా సమావేశం..




**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 12:** మేడ్చల్ కోర్టు సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద జరిగిన "చైన్ స్నాచింగ్" కేసును మేడ్చల్ పోలీసులు ఛేదించారు.. సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా విశ్లేషించి నిందితులను గుర్తించిన మేడ్చల్ క్రైమ్ టీమ్, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టి ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ చైన్ స్నాచింగ్ కేసు 2026 మే 29న నమోదైంది.. బాధితురాలు పటూరి శుభరాణి అనే మహిళ ఫిర్యాదు ప్రకారం.. మునిరాబాద్ గ్రామంలోని రత్నదీప్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నానని తెలిపింది. సాయంత్రం కంపెనీ బస్సు నుంచి మేడ్చల్ కోర్టు సమీపంలోని హెచ్‌బీ బాటిల్ బంక్ వద్ద దిగిన తర్వాత మైల్‌స్టోన్ వెంచర్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా, కల్వర్ట్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డగించారు.. వారిలో ఒకరు మహిళ మెడలో ఉన్న సగం తులం బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని, మిగిలిన ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు.. నిందితులు నల్లటి టీ-షర్ట్‌లు, ముఖాలను కప్పే క్యాపులు ధరించి ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.. ఈ కేసునమోదు చేసుకున్న మేడ్చల్ పోలీసులు, సంఘటన స్థలం నుంచి తూప్రాన్ వరకు, పరిసర ప్రాంతాల్లోని సుమారు 100 నుంచి 120 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుల కదలికలను గుర్తించారు..

### ఇతర రాష్ట్రంలోనూ నిందితుల కోసం గాలింపు..

దర్యాప్తు బృందాలు కర్ణాటకలోని బీదర్ జిల్లా, మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతాల్లో కూడా విచారణ చేపట్టాయి.. అనంతరం జవహర్‌నగర్ ప్రాంతంలో నిందితులను గుర్తించి పట్టుకున్నారు.. అరెస్టు అయిన నిందితుడు పోలీసులు అరెస్ట్ చేసిన వ్యక్తిని రూప్‌సింగ్ చతుర్‌సింగ్ తక్ (31)గా గుర్తించారు. అతను ప్రస్తుతం మేడ్చల్ లోని బాలాజీనగర్ ప్రాంతంలో నివసిస్తూ స్క్రాప్ షాప్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం.. మరో నిందితుడు శంషేర్ సింగ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.. అలాగే అరెస్ట్ అయిన నిందితుడిపై కర్ణాటక రాష్ట్రంలోని గాంధీగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసు కూడా నమోదై ఉన్నట్లు మేడ్చల్ పోలీసులు వెల్లడించారు.. నిందితుడి వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు: నకిలీ గొలుసు (లిమిటేషన్ చైన్) మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్ స్వాధీన పరుచుకున్నారు.. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన మేడ్చల్ క్రైమ్ టీమ్, సీసీఎస్ సిబ్బంది పనితీరును, ఏసిపి శంకర్‌రెడ్డి అభినందించారు.. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.. ముఖ్యంగా వ్యాపారులు, దుకాణదారులు తమ ప్రాంతాల్లో అధిక నాణ్యత గల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. ఇవి నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు..

- మేడ్చల్ కోర్టు సమీపంలో మహిళ మెడలో మంగళసూత్రం లాక్కెళ్లిన దొంగల ముఠా..!
- 100-120 సీసీ కెమెరాల ఫుటేజీలతో నిందితులను గుర్తించిన పోలీసులు..
- మహారాష్ట్ర, కర్ణాటక వరకు వెళ్లిన దర్యాప్తు బృందం..
- అరెస్ట్ అయిన నిందితుడిపై కర్ణాటకలోనూ కేసులు ఉన్నట్లు విచారణలో వెల్లడి..
- బైక్, మొబైల్‌తో పాటు నకిలీ గొలుసు స్వాధీనం..ఒరిజినల్ బంగారం గల్లంతు..

# బంజారాహిల్స్ నీలోఫర్ కేఫ్ ఎన్వోసీ రద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలోని బంజారాహిల్స్‌లో ఉన్న నీలోఫర్ కేఫ్ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ)ను అగ్నిమాపక శాఖ రద్దు చేసింది. ఇందులో ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. నాలుగో అంతస్తులో అనుమతి లేకుండా రెస్టరంట్ నిర్వహిస్తున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పాటించాలని యజమానికి డీజీ విక్రమ్‌సింగ్ హెచ్చరించారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


# రూ.687 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల అవినీతి ఎక్కడుంది?



## హరీశ్‌రావువి పచ్చి అబద్ధాలు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్ పెన్ పవర్:** గురుకులాల్లో ఎడ్యుకేషన్ కిట్ కేంద్రీకృత టెండర్లలో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు సత్యదూరమని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టంచేశారు. టెండర్ల విలువే రూ.687.78 కోట్లు ఉంటే... రూ.2 వేల కోట్ల అవినీతి ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు.

-4 లో



# వచ్చే ఏడాది మార్చి వరకు బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** బీబీనగర్‌లో నిర్మిస్తున్న ఎయిమ్స్ ఆసుపత్రిని వచ్చే ఏడాది ఫిబ్రవరి– మార్చి నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆసుపత్రిని కూడా మరో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. అమీర్‌పేట, సనత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను శుక్రవారం కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమీర్‌పేట యూపీహెచ్‌సీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు ముఖ్యంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ పేద కుటుంబానికి రూ.5 లక్షల మేరకు ఉచిత వైద్యం అందించేలా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు.

- మిగతా 4లో...

# ఉత్పత్తితో పాటు విలువలు పెరిగితేనే అన్నదాతలకు వ్యవసాయం

## అగ్రి వర్సిటీ 62వ వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి తుమ్మల

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో పంటల ఉత్పత్తులే కాకుండా.. వాటి విలువలు పెరగాలని, కృత్రిమ మేధ, డ్రోన్లు, యాంత్రీకరణతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

-4 లో



# టైటిల్ ఫైట్.... కవిత వర్సెస్ కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ అనే మూడు అక్షరాలు ఇప్పటికీ భావోద్వేగాన్ని, చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఆ పేరును తమకు కేటాయించాలని అనేక పార్టీలు ఎన్నికల సంఘం (ఈసీ) ముందు పోటీ పడుతుండగా, బీఆర్ఎస్ నేతలు ఆ పేరు ఎవరికీ ఇవ్వకూడదని ఫిర్యాదు చేశారు. ఇది కేవలం పేరు వివాదం కాదు. ఇది తెలంగాణ ఉద్యమ వారసత్వం ఎవరి చేతుల్లో ఉండాలి, ఓటర్ల ముందుగుర్తింపు ఎలా ఉండాలి అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. 2022లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ ఖాళీగా ఉంది. ఆ పేరు కోసం కొత్త పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇందులోకల్వకుంట్ల కవిత నేతృత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' ప్రముఖంగా ఉంది. ఆ పార్టీ పేరు ప్రకటనపై 600కి పైగా అభ్యంతరాలు వచ్చాయి.బీఆర్ఎస్ మద్దతుదారులు, తెలంగాణ ఉద్యమకారులు,సామాన్య ప్రజల నుంచి ఈసీకి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కవిత పార్టీ నేతలు త్వరలో ఎన్నికల సంఘాన్ని నేరుగా కలిసి తమ వాదనను వినిపించనున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' కూడా టీఆర్ఎస్ పేరును తమకు కేటాయించాలని ఈసీని ఆశ్రయించింది. తెలంగాణ బయటి నుంచి వచ్చిన ఈప్రయత్నం, టీఆర్ఎస్ పేరు కేవలం తెలంగాణలోనే కాకుండా, సరిహద్దు ప్రాంతాల్లోని తెలుగు మాట్లాడే ప్రజల్లో కూడా గుర్తింపు కలిగి ఉందని చెబుతోందిభారతీయ రాజకీయాల్లో పార్టీ పేరు కేవలం ఒక లేబుల్‌కాదు. అది ఓటర్ల మనసుల్లో నిలిచిపోయిన బ్రాండ్. టీఆర్ఎస్ పేరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంతో ముడిపడి ఉంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలకు ఇది గౌరవం, గుర్తు. కొత్త పార్టీఆ పేరును ఉపయోగించుకుంటే, ఓటర్లు సులభంగా ఆకర్షితులవుతారు. అదే సమయంలో, బీఆర్ఎస్ తన పాత పేరును రక్షించుకోవాలనుకుంటోంది. పేరు మార్చుకున్న తర్వాత కూడా, ప్రజలు ఇంకాబీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే



గుర్తిస్తున్నారు.ఎన్నికల సంఘం ఈ వివాదంలో కీలక పాత్ర పోషించాలి. పార్టీల నమోదు నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న పార్టీ పేరుకు సమీపంలో ఉన్న పేర్లనుఅనుమతించకూడదు. ఆఖ ఫిర్యాదు, కవిత పార్టీపై వచ్చిన వందలాది అభ్యంతరాలు, మహారాష్ట్ర పార్టీ కోరిక ఇవన్నీ ఈసీ ముందు ఉన్నాయి. ఈసీ ఒకవేళ కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు ఇస్తే, బీఆర్ఎస్మద్దతుదారుల్లో అసంతృప్తి పెరగవచ్చు. ఒకవేళ నిరాకరిస్తే, కొత్త పార్టీలు "వారసత్వం అడ్డుకుంటున్నారు" అనే ఆరోపణలు చేయవచ్చు. రెండు వైపులా రాజకీయ లాభనష్టాలు ఉన్నాయి. అందుకేఈసీ త్వరగా, పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలి. అన్ని పార్టీలను పిలిచి విన్నపాలు విని, స్పష్టమైన కారణాలతో తీర్పు ఇవ్వాలి.ఎన్నికల సంఘం న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే, ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరింత పరిపక్వతను తీసుకురావచ్చు. లేకపోతే, ఇది మరిన్ని గందరగోళాలకు దారితీసే ప్రమాదం ఉంది. టీఆర్ఎస్ పేరు ఎవరిది అనేది న్యాయస్థానాలు లేదా ఎన్నికల సంఘం నిర్ణయించాలి. కానీ ఆ పేరు వెనుక ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశలు ఎవరూ దోచుకోకూడదు. అది మాత్రం తెలంగాణ ప్రజలే నిర్ణయించాలి.

# రూ.687 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల అవినీతి ఎక్కడుంది?

-3 పేజి తరువాయి
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో విద్యాబోధన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... హరీశ్‌రావు, కేటీఆర్‌లు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారమిక్కడ సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బూట్ల తదితర వస్తువుల కొనుగోలులో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్‌రావు చేసిన ఆరోపణల్ని ఖండిస్తున్నాం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు అందించాలన్న లక్ష్యంతో జాతీయ స్థాయి టెండర్లు పిలిచాం. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలకు 25% పనులు అప్పగించాం. హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలున్నాయా? ఈ టెండర్లలో పాల్గొన్న సంస్థలు, కోట్ చేసిన వివరాలతో శ్వేతపత్రాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుంది. 2014 నుంచి 2023 వరకు భారాస ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఏం చేసిందో చెప్పాలి. కనీసం అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు కట్టించారా..? దీనిపై హరీశ్‌రావుకు సవాల్ విసురుతున్నా.. మా ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించింది. గురుకులాల్లో అత్యవసర పనులు వేగంగా చేసేందుకు వీలుగా ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ.2 కోట్ల నిధిని అందుబాటులో పెడుతున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్లను ఆమోదించి పనులు అప్పగించాం" అని పేర్కొన్నారు.

# ఉత్పత్తితో పాటు విలువలు పెరిగితేనే అన్నదాతలకు వ్యవసాయం

-3 పేజి తరువాయి
62వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'భారత హరిత విప్లవానికి ఇందిరాగాంధీ అద్భుత సేవలు' అనే అంశంపై వర్సిటీ ఆడిటోరియంలో జాతీయ సదస్సు నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై ప్రసంగించారు. 'వ్యవసాయ రంగంలో తెలంగాణ పురోగమిస్తోంది. అది ఉత్పత్తికే పరిమితం కాకుండా శుద్ధి, మార్కెటింగ్, ఎగుమతులు పెరగాలి. 1964లో ఏర్పాటైన వర్సిటీ ఆరు దశాబ్దాలకు పైగా వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణ సేవల ద్వారా రైతులకు అండగా నిలుస్తోంది. ప్రస్తుత రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త మార్పులకు దిక్సూచిగా నిలవాలి" అని మంత్రి సూచించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. "దేశం ఆహార భద్రత సాధించడంతో ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగడానికి ఇందిరాగాంధీ కృషే కారణం. అన్నదాతలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి అగ్రి వర్సిటీ కృషి చేయాలి" అని అన్నారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు విభాగాధిపతి మధుర స్వామినాథన్ మాట్లాడుతూ.. హరిత విప్లవం ద్వారా ఉత్పత్తి, దిగుబడుల్లో దేశం స్వయం సమృద్ధిని
సాధించిందని, చైనా వంటి దేశాలను అధిగమించడానికి దేశం మరింత కృషి చేయాలని సూచించారు. సదస్సులో రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అగ్రి, ఉద్యాన, పశువైద్య వర్సిటీ వీసీలు అల్దాస్ జానయ్య, రాజిరెడ్డి, జ్ఞానప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏడాది మార్చి వరకు బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి

- 3 పేజి తరువాయి
సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ, బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈఎస్ఐసీలో నిర్మించిన కొత్త ఓపీ బ్లాక్‌ను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. రూ.వెయ్యి కోట్లతో అదనపు భవనాలు, హాస్టల్ వసతులు, మరిన్ని పడకలు ఏర్పాటు చేసి ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సామర్థ్యాన్ని మరింత పెంచుతామన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని యూపీహెచ్‌సీల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నామని, అవసరమైన వైద్య పరికరాలను కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీనియర్ ప్రజారోగ్య అధికారిణి డా.హేమలత, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ఎ.సుజాత, దిశా కమిటీ సభ్యులు బూర్గుల శ్యామ్‌సుందర్, భాజపా జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఉపాధ్యక్షులు వెల్లాల రాంమోహన్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నర్సింహులపేట ఎంపీడీవో, ఎంపీఓ

**మహబూబ్ నగర్: పెన్ పవర్:**నర్సింహులుపేట ఎంపిడీవో, ఎంపివో లంచం తీసుకుంటూ ఏసీబీ దొరికిపోయారు. దాంతో స్థానికులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. వారిద్దరూ రూ. 45 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.
మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల పరిషత్ కార్యాలయంలో ఒక వెంచర్ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసి, ఆ డబ్బులు తీసుకుంటుండగా ఎంపీడీవో రాధిక, ఎంపీఓతో పాటు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఎంపీడీవో కుమారుడిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.

## నేనిప్పటికీ కాంగ్రెస్ లోనే వున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:**శుక్రవారం నాడు నాంపల్లి కోర్టు లో కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ కేసు సంచలం సృష్టించింది. కేసులో పిర్యాదుదారు మహిళ తన వివరాలు లీక్ చేయడంపై కోర్టు ఆవరణలో ఆవేదన వ్యక్తం చేసింది. అయితే తన సమాచారాన్ని ఎవరు బయటపెట్టారో తెలియదని వాపోయింది. కొందరి వల్ల తనకు ప్రాణహాని ఉందని కోర్టు ఆవరణలో మీడియాకు వెల్లడించింది. కోర్టుకు రాకుండా అడ్డుకున్నారు.. ఆటోను వెంబడించారని సంచలన వ్యాఖ్యలు చేసింది. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపను. ఇప్పటికీ తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని వెల్లడించింది.

## పోలీసులకు రికవర్రీ....

**కరీంనగర్, జూన్ 12, పెన్ పవర్: :** కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌పై జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఘటన జరిగి దాదాపు 40 రోజులు అయినా చోరీ అయిన వజ్రాలు,బంగారు ఆభరణాల ఆచూకీ ఇప్పటికీ పూర్తిగా లభ్యం కాలేదు. సాధారణ దోపిడీ కేసుల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ అయ్యేవి, కానీ ఈ కేసు పూర్తి వ్యతిరేక దిశలో సాగుతోంది.ఈ దోపిడీ కేసులో కీలక
నిందితుడిగా పోలీసులు గ్యాంగ్‌స్టర్ సుబ్యోద్‌సింగ్ అని గుర్తించారు. ఇటీవలే అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు ఇతర నిందితులు కూడా విచారణలో పరస్పరం విరుద్ధమైనవాదనలు చెబుతున్నారు. ఒకరు ఒక విషయం చెప్పగా, మరొకరు దానికి పూర్తి వ్యతిరేకంగా సమాధానాలు ఇవ్వడం పోలీసులను తీవ్ర గందరగోళంలో పడేస్తోంది. ఈ విరుద్ధ సమాధానాలు సహజమైనవాలేదా నిందితులు కావాలని పోలీసులను తప్పుదారి పట్టించడానికి చేస్తున్న వ్యూహాత్మక ప్రయత్నమా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. గ్యాంగ్‌స్టర్ నేతృత్వంలోని ఈ బృందం ఇలాంటి పరిస్థితులనుఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధమై ఉండవచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.పీఎంజే కేసు దర్యాప్తు సాధారణ దొంగతనం కంటే చాలా క్లిష్టంగా మారింది. దోపిడీ జరిగిన వెంటనే సొత్తును వేర్వేరు
చోట్లకు తరలించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తర్వాత ఆభరణాలను కరిగించి వేరే రూపంలో మార్చడం లేదా ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపించడం జరిగి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.నిందితుల మధ్య ఉన్న విరుద్ధ వాదనలు నిజమైన సమాచారాన్ని బయట పెట్టడం లేదు. సైంటిఫిక్ ఫారెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లోతైన విశ్లేషణ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ వంటిఅధునాతన పద్ధతులు తప్పనిసరి అవుతున్నాయి.ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. సుబోధ్ సింగ్ ఇప్పటికే అనేక ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న గ్యాంగ్‌స్టర్ కావడంతో దోపిడీ వెనుక పెద్ద
నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పుడు కేవలం నిందితుల వాదనలపైనే ఆధారపడకుండా మరింత లోతైన విచారణ జరపాల్సి ఉంది. సొత్తు రికవరీలో ఆలస్యం జరిగితే నేరస్తులకు ధైర్యం పెరిగి,ఇలాంటి భారీ దోపిడీలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.పోలీసులు ఈ విరుద్ధ సమాచారాలను అధిగమించి, నిజమైన సొత్తు ఆచూకీని త్వరగా గుర్తించి రికవరీ చేయగలరా అనేదే ఈ కేసులో అత్యంతకీలకమైన అంశం. దర్యాప్తు ఎంత సమర్థవంతంగా, ఎంత త్వరగా ముగుస్తుందో అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ప్రాణాలు కోల్పోయిన ప్రైవేటు కార్మికుడు

### విధులు నిర్వహించకుండా ప్రైవేట్ కార్మికులను నియమించుకుంటున్న లైన్ మెన్లు

**కోదాడ: పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దార్వకుంట గ్రామంలో ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయం రావడంతో సరిచేసేందుకు ప్రైవేట్ కార్మికుడు రెడ్డిబోయిన గోపిని స్థానిక లైన్ మెన్ స్తంభం ఎక్కించాడు.స్తంభం ఎక్కగానే ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో స్తంభం పైనుండి కిందపడి గోపి ప్రాణాలు కోల్పోయాడు. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యుత్ అధికారులు పని చేయకుండా, ప్రైవేట్ కార్మికులతో పనిచేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

## మీనాక్షి నటరాజన్ మీద తెలంగాణ కాంగ్రెస్ నాయకులే కుట్ర చేశారు

**భోపాల్ పెన్ పవర్:** మీనాక్షి నటరాజన్ మీద తెలంగాణ కాంగ్రెస్ నేతలే కుట్ర చేశారని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుండ బద్దలు కొట్టారు. మీనాక్షి నటరాజన్ మీద అసంతృప్తితో ఉన్న తెలంగాణ కాంగ్రెస్‌నాయకుల కుట్ర వల్లే ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైందని అయన వ్యాఖ్యానించారు. పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగుళూరు తీసుకెళ్లే ప్లాన్ చివరి నిమిషంలో చార్టెడ్ ఫ్లైట్ డిలే వల్ల ఆగిపోవడంలాంటి అంశాలు చూస్తే ఇది ఖచ్చితంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల కుట్ర అని అర్థమవుతుందని అయన అన్నారు.

## కామారెడ్డి కాంగ్రెస్ లో లుకలుకలు

### షబ్బీర్ అలీ పై పిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
రేవంత్ తమ్ముడు కొండల్ రెడ్డి, షబ్బీర్ అలీ గ్రూప్ మధ్య విబేధాలు కామారెడ్డిలో తారాస్థాయికి చేరుకున్నాయి. టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి భార్య గడ్డం ఇందుప్రియ అలీపై పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఇందుప్రియ మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదు. షబ్బీర్ అలీని బహిరంగంగా హెచ్చరిస్తున్నాను. షబ్బీర్ అలీ అన్న కొడుకు షేరు నన్ను అసభ్యంగా ట్రోల్ చేస్తున్నాడు. నేను క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నాననే నా మీద కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.నేను నా భర్త చంద్రశేఖర్ రెడ్డి( టీపీసీసీ జనరల్ సెక్రటరీ) నిత్యం ప్రజా సేవలోనే ఉంటాము. సీనియర్ నాయకుడిని అని చెప్పుకునే షబ్బీర్ అలీ మహిళల పట్ల ప్రవర్తించే తీరు ఇదేనా? బయట దేశాల నుండి షబ్బీర్ ఆలీ సోషల్ మీడియాలో నా మీద అసభ్య పోస్టులు వేయిస్తున్నాడు. చర్ల రాజేష్ అనే సీనియర్ నాయకుడిని నేను బాబాయ్ అని పిలుస్తాను, అతను కూడా నా మీద వేసిన ట్రోల్స్ అన్ని గ్రూపులో షేర్ చేశాడు. నా గురించి ప్రచారం చేసేటప్పుడు మీ ఇంట్లో కోడలు, భార్య గుర్తుకురాలేదా. షబ్బీర్ అలీ అరాచకాల గురించి రాహుల్ గాంధీకి కూడా ఫిర్యాదు చేస్తానని అన్నారు.

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు.కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు.ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతం గా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి...**

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు.
ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా కేంద్రంలోని శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం లేకుండా నేరుగా పాఠశాలలోనే విక్రయిస్తున్నారని వారు మండిపడ్డారు.ఈ సామగ్రి పేరుతో తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందని, దీనిపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు ఈ విధంగా వస్తువులు విక్రయించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.అంతేకాకుండా, పాఠశాల భవనం నిర్మాణ పనులు పూర్తికాకముందే స్కూల్‌ను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మరోవైపు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు."విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేయడం దురదృష్టకరం. కార్పొరేట్ విద్య పేరుతో జరుగుతున్న ఈ దోపిడీని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అరికట్టాలని లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు.

## హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ ఇన్సూరెన్స్ విభాగం చైర్మన్ పవన్ మల్లాది,మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్,7 మండలాల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నేతలు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.2002 లో ఓటర్ల సవరణ కార్యక్రమం జరిగినపుడు అర్హత ఉండి ఏ ఒక్క ఓటు మిస్ కావద్దు అని ఎన్నికల కమిషన్ అప్పటి ప్రభుత్వాలు భావించాయి. ఓటరు సవరణ ఉదేశ్యం బీజేపీ కి వ్యతిరేకంగా ఉన్న ఓటు హక్కు తొలగించాలని ఆలోచన తో ఉంది దాని ద్వారా రాజాకి లబ్ధి పొందాలని భావిస్తుందిఏ ఒక్క అర్హత ఉన్న ఓటు తొలగించకుండా మనం జాగ్రత్తగా ఉండాలి.మీ బూత్ లలో ఏ ఒక్క ఓటు పోకుండా చూసుకునే బాధ్యత మన బిఎల్ ఎ లది.ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభం. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అత్యంత కీలకం.
బూత్ లెవల్ ఏజెంట్లు బిఎ ఏలు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలి వారి పని పారదర్శకంగా బాధ్యతాయుతంగా ఉండాలి.ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలి.ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలి.
ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమైనది. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా ప్రతి బిఎల్ ఏ బాధ్యతతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి.

## కోచ్ జస్పాల్ రాణా మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. జస్పాల్ రాణా మరణంతో భారతదేశం ఒక గొప్ప క్రీడాకారుడిని మాత్రమే కాకుండా, తన ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాసేవతో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే ఓ మార్గదర్శకుడిని కోల్పోయింది" అని ముఖ్యమంత్రి అన్నారు.
ఈ విషాద సమయంలో జస్పాల్ రాణా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, క్రీడా రంగానికి చెందిన వారందరికీ ముఖ్యమంత్రి తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

### సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్.. 24 నెలలు 24 మోసాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి పాలనంతా మాయాబజార్.. మోసాలమయం. విజన్ లేదు విజ్ఞం అంతకన్నా లేదు. బాబు షూరిటీ లేదు.. భవిష్యత్ కి గ్యారెంటి లేదు. పునర్ నిర్మాణం జరగలేదు..పునరంకితానికి దిక్కులేదని ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. ఎదే ఉద్ధరిస్తారని అధికారమిస్తే రాష్ట్ర ప్రజలకు పెట్టినవి పెద్ద పంగనామాలు. కూటమి ఇచ్చిన హామీలు గంపెడు.. అమలు చేసింది చిటికెడు. అబద్ధపు మాటలు చెప్పి, మ్యానిఫెస్టోపై మాట తప్పి, స్వర్ణాంధ్ర సాధన జరిగిందని, సుపరిపాలన సాగుతోందని, అభివృద్ధి, సంక్షేమం పేరిట ..విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి పార్టీలకు సిగ్గుండాలి. నిజాలు దాచి అబద్ధాలు ప్రచారం చేయడమంటే నైతికతకు నీళ్లు వదిలేయడమేనని అన్నారు.రెండేళ్లుగా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు. నెలకు 15 వందలు ఇస్తామని చెప్పిన మహిళాశక్తి పథకానికి దిక్కులేదు. 20 లక్షల ఉద్యోగాల జాడలేదు.. లేకుంటే ఇస్తామని చెప్పిన 3 వేల నిరుద్యోగ బృతికి గతి లేదు. మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి అంతా సగం సగమే. సూపర్ సిక్స్ ను సూపర్ ఫ్లాప్ చేసి, సూపర్ హిట్ అని చెప్పుకోవడం చంద్రబాబు గారికే సాధ్యం. చేసిన వాగ్దానాలను విలువలేదు . మ్యానిఫెస్టో 143 హామీల అమలుకు అతి గతి లేదు. మెగా డీఎస్సీ దగా డీఎస్సీ చేసి, జాబ్ క్యాలెండర్ ను జాబులు లేని క్యాలెండర్ గా మార్చారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఉన్న పెన్షన్లనే ఊడపీకారు. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని మోసం చేశారు. పేదలకు రెండు లేదా మూడు సెంట్ల భూమి ఇస్తామని మాట తప్పారు. పక్కా ఇండ్లు కట్టిస్తామన్న హామీని తుంగలో తొక్కారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమాన్ని అటకెక్కించారు. కౌలురైతులకు కౌలు కార్డులు దిక్కులేదు. ధరల స్థిరీకరణ అమలు జరగలేదు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పరికరాలు అందలేదు. చివరికి రైతు పండించిన పంట నేలపాలైతే పరిహారం ఇవ్వ చేతకాలేదని విమర్శించారు.జీవనాడి పోలవరం పూర్తికాలేదు. పెండింగ్ లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్టులకు ముట్టుకోలేదు. 30 శాతం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని 15 వేల కోట్ల చార్జీల భారాన్ని మోపారు. ఫీజు రీయింబర్స్ కొనసాగిస్తామని 7 వేల కోట్ల బకాయిలు పెట్టారు. ఆరోగ్యశ్రీకి 3 వేల కోట్ల బకాయిలు ఇవ్వడానికి మనసు రావడం లేదు. పెట్రోల్ , డీజిల్ ధరకు నియంత్రణ అని హామీ ఇచ్చి దేశంలోనే అధిక ధరలు మోపారని అన్నారు.కేజీ నుంచి పీజీ + ఉచిత విద్య, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రత్యేక అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక వసతులు, జర్నలిస్టులకు ఇండ్లు, ఆక్వా రంగానికి ఊతమంటూ ఇచ్చిన ప్రతి హామీ బూటకమే. విభజన హామీలను విస్మరించి, కేంద్రం నుంచి దక్కాల్సిన నిధులపై మాట మాట్లాడకుండా, ప్రధాని మోడీజీ భజన చేస్తూ, మతాల మధ్య విభజన తెస్తూ, క్రిస్టియన్ మైనారిటీల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసి, రాష్ట్రాన్ని మరో 3.50 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేసి పెట్టిన, కూటమి రెండేళ్ల పాలన రాష్ట్రానికి పట్టిన మరో దౌర్భాగ్యమని మండిపడ్డారు.

## ఖమ్మంలో మున్నేరు నదిపై ఈ కేబుల్ బ్రిడ్జి

**హైదరాబాద్ పెన్ పవర్:**
హైదరాబాద్‌లో దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి.. నగరంలో ట్రాఫిక్ తగ్గించడం, మెరుగైన రవాణాతోపాటు.. పర్యాటక పరంగా కూడా చాలా ఉపయోగపడుతోంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని ఇతరప్రాంతాల్లో కూడా ఇలాంటి కేబుల్ బ్రిడ్జిలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. హైదరాబాద్‌లోనే మీర్ ఆలం కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మిస్తున్నారు. మరోవైపు.. కరీంనగర్‌లో కూడా మానేరు నదిపైనా తీగల వంతెనను నిర్మించారు. వీటితోపాటు ఖమ్మం నగరంలోనూ మున్నేరు నదిపై రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఫైనల్ దశకు చేరుకున్నాయి.కాల్వొడ్డు-జలగంనగర్ మధ్యమున్నేరు నదిపై 1.25 కిలోమీటర్ల పొడవున ఈ తీగల వంతెనను నిర్మిస్తున్నారు. 2 ఏళ్లుగా సాగుతున్న ఈ కేబుల్ బ్రిడ్జి.. పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ వంతెనలో రెండు బాహుబలి పిల్లర్లనుఏర్పాటు చేసి.. వాటి ఆధారంగా స్టీల్ తీగలపై ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఇక నది ప్రాంతంలో 300 మీటర్ల పొడవున వంతెన భాగం తీగలపై వేలాడుతూ ఉంటుంది. దీనికి ఇరువైపులా వయాడెక్ట్, అప్రోచ్ రోడ్లుకలిపి 1.25 కి.మీ.ల పొడవు ఉంటుంది.ఇక ఈ కేబుల్ బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది. 4 వరుసల్లో ఈ కేబుల్ బ్రిడ్జిని నిర్మించగా.. సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్,బ్రిడ్జి పక్కన ఇరు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించాల్సి ఉంది. ఇక ఈ కేబుల్ బ్రిడ్జిని నాలుగు వరుసల్లోనూ తారు వేయనున్నారు. ఈ ఖమ్మం తీగల వంతెన నిర్మాణ పనులు 85 శాతం పూర్తి అయినట్లు ఆర్అండ్ బీ డీఈ భగవాన్ వెల్లడించారు.రివర్ బెడ్‌లో పనులు మొత్తం పూర్తి చేశామని తెలిపారు. వంతెన పైభాగంలో పనులు 3 నెలల్లో పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో ఖమ్మంతీగల వంతెన వాహనదారులకు అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడమే కాకుండా..
నగరవాసులకు ఒక టూరిస్ట్ స్పాట్‌గా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

## వానొస్తే...ఇంతేనా
# హైడ్రా, గ్రేటర్ మధ్య సమన్వయ లోపం

హైదరాబాద్. జూన్ 12, **పెన్ పవర్:**
భాగ్యనగరంలో వానాకాలం ముంచుకొస్తున్న తరుణంలో బల్దియా యంత్రాంగం, హైడ్రా చేసిన ముందస్తు ఏర్పాట్లలోని లోపాలు తొలి వర్షానికే పూర్తిగా బయటపడ్డాయి. వర్షాలొస్తున్నాయంటూ వివిధ ప్రభుత్వశాఖలతో వరుస సమన్వయ సమావేశాలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. క్షేత్రస్థాయిలో జరగాల్సిన సన్నద్ధతపై మాత్రం దృష్టి సారించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం మొదలయ్యాక అత్యవసర బృందాలు, ఇతర యంత్రాంగం ఏర్పాటుకు టెండర్లు పిలవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరోవైపు, హైడ్రా హడావుడి చూసి అంతా ఆ సంస్థే చూసుకుంటుందనేభావనతో నగరంలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు చేతులెత్తేయడంతో సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. దీని ఫలితంగా మంగళవారం కురిసిన వర్షానికి నగరవ్యాప్తంగా సుమారు మూడు లక్షలమంది వాహనదారులు అర్ధరాత్రి వరకు రోడ్లపైనే నరకయాతన అనుభవించారు.నగరంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వరద నాలాల నిర్మాణం అసంపూర్తిగామిగిలిపోవడం, నాలాల పూడికతీత పనులు సరిగా జరగకపోవడం ఈ ముంపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దీనికి తోడు ముంపు సమస్యను తక్షణమే సరిదిద్దే అత్యవసర బృందాలను సకాలంలోఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. మే నెల ప్రారంభం నుండే హైడ్రా ఆధ్వర్యంలో వర్షకాల సన్నద్ధతపై సమావేశాలు నిర్వహించి, అధికారులకు సూచనలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలోపరిస్థితి మాత్రం ఆశించినట్లుగా లేదని ఈ ఒక్క వర్షంతో తేలిపోయింది.హైటెక్స్ సమీపంలోని జూబ్లీగార్డెన్ రోడ్డు నంబర్ 8 లో గతంలో భారీ వర్షం కురిస్తే 20 నిమిషాల పాటు వరద నీరు నిలిచేది. కానీ జూన్ 9న కురిసిన వర్షానికి ఇక్కడి కాలనీలు ఏకంగా నాలుగు గంటల పాటు వరద నీటిలో చిక్కుకుపోయాయి. రోడ్లపై నడుముల్లోతు నీరు చేరడంతో కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. ఈ ప్రాంతంలోమీనాక్షి టవర్స్, వాసవి టవర్స్ వంటి భారీ బహుళ అంతస్తుల ప్రాజెక్టులు నిర్మించడంతో సహజ వరద నీటి ప్రవాహ మార్గాలన్నీ మూసుకుపోయాయి. వరద నాలాల సామర్థ్యం ప్రవాహ మార్గాల గురించిఆలోచించకుండా ఉన్నతాధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఇంజనీరింగ్ లోపాలతో రోడ్లు వేయడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయినా, సహాయం చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు ఎవరూ కనిపించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
రోజంతా కరెంట్ కట్...కొన్ని గంటల క్రితం కురిసిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బల్దియా పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసింది. విద్యుత్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న కాలనీలు సైతం 24 గంటలకు పైగా కరెంట్ లేక నరకయాతన పడ్డాయి. విపత్తులు తలెత్తినప్పుడు అన్ని విభాగాలు కలిసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోనిసైఫాబాద్, ఆజామాబాద్ డివిజన్లలో అధికారుల తీవ్ర జాప్యం వల్ల వినియోగదారులు కరెంట్ లేక నానాపాట్లు పడ్డారు.ముషీరాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వానకు పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలునేలకొరిగాయి. చెట్లు విరిగిపడటంతో ఇనుప విద్యుత్ స్తంభాలు వంగిపోయి, లైన్లు తెగిపడటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అత్యవసర సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను వెంటనేతొలగించినప్పటికీ, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గాంధీనగర్, హెబ్రోన్ చర్చి వీధి, వై జంక్షన్, విద్యానగర్, ఎస్‌బీఐ బ్యాంక్ వీధి,
సీపీఎం మార్క్స్ భవన్ రాష్ట్ర కార్యాలయం వీధి, అడిక్‌మెట్ డివిజన్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి ప్రాంతాల్లో 24 గంటలు గడిచినా సరఫరా పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.జోన్ల వారీగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల వివరాలు:హైదరాబాద్ సెంట్రల్: 56 స్తంభాలు
సికింద్రాబాద్: 11 స్తంభాలుహైదరాబాద్ సౌత్: 10 స్తంభాలుసైబర్ సిటీ: 8 స్తంభాలుఐటీ ఉద్యోగులు, వ్యాపారుల ఇబ్బందులుదీర్ఘకాలిక విద్యుత్ కోతల కారణంగా వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచి) పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు చార్జింగ్ లేక ల్యాప్‌టాప్‌లు పనిచేయక, ఫోన్లు స్విచ్ ఆఫ్ అయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపుకేబుల్ వైర్లు తెగిపోవడంతో ఇంటర్నెట్ సేవలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. విద్యానగర్, గాంధీనగర్, అడిక్‌మెట్ ప్రాంతాల్లోని 50కి పైగా అపార్ట్‌మెంట్లు, 100కు పైగా ఇండ్లలో కరెంట్ కష్టాలు తలెత్తడంతో వ్యాపారులు అద్దెకు జనరేటర్లను తెచ్చుకుని వ్యాపారాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
అపార్ట్‌మెంట్లలో లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు నానాయాతన పడ్డారు. కరెంట్ లేకపోవడంతో మోటార్లు నడవక ట్యాంకుల్లో నీరు అయిపోయి, తాగునీటితో పాటు కనీస అవసరాలకు తీవ్ర కొరత ఏర్పడింది.

# అటు కేసీఆర్... ఇటు కేటీఆర్...

**మెదక్, జూన్ 12, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి తర్వాత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు మైండ్ బ్లోయింగ్ ప్లాన్‌తో పొలిటికల్ గ్రౌండ్‌లోకి దూకేందుకు సిద్ధమైంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి క్షేత్రస్థాయిలోకి రాబోతుండటం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.తండ్రీకొడుకులు ఇద్దరూ ఒకే వ్యూహంతో, కానీ భిన్న రూపాల్లో ప్రజల ముందుకు రావడం ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది.ఎన్నికల ఫలితాల తర్వాతకేసీఆర్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారంటూ ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు గులాబీ బాస్ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా భారీ బస్సుయాత్రకు కేసీఆర్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ, నేరుగా ప్రజలతో మమేకం కావాలని ఆయన భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేడర్‌లో మళ్లీ మునుపటిజోష్ నింపడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుంది. ప్రస్తుతం పార్టీ ముఖ్య నేతలు ఈ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఫైనలైజ్ చేసే పనిలోనిమగ్నమయ్యారు.మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త పంథాను ఎంచుకున్నారు. తండ్రి బస్సు యాత్ర చేస్తుంటే, కొడుకు సుదీర్ఘ పాదయాత్రకు



సిద్ధమవుతున్నారు. యువతను,సామాన్య ప్రజలను ఆకట్టుకునేలా సుదీర్ఘ కాలం పాటు ఈ పాదయాత్ర సాగనుంది. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, జనాన్ని పలకరిస్తూ సాగనున్న ఈ యాత్ర పార్టీకి కొత్త ఊపిరిపోస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. తండ్రి బస్సుపై ఉంటూ.. కొడుకు నడుస్తూ జనాన్ని పలకరించే ఈ డ్యూయల్ స్ట్రాటజీ తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గామారింది.ప్రస్తుతం తెలంగాణలో పొలిటికల్ సినారియో పూర్తిగా మారిపోయింది. ఓ వైపు అధికార కాంగ్రెస్, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రెండు పార్టీలు బీఆర్ఎస్‌ను తీవ్రంగా కార్నర్‌చేశాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా, మున్ముందు ఆ పార్టీని మూడో స్థానంలోకి నెట్టేయాలని ఉమ్మడిగా గట్టి వ్యూహాలు రచిస్తున్నాయి.ఇలాంటి అత్యంత క్లిష్టపరిస్థితుల్లో తామేంటో, తమ సత్తా ఏంటో చాటాల్సిన అగ్నిపరీక్ష బీఆర్ఎస్‌కు ఎదురైంది. పార్టీని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావాలంటే జనంలోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదని గులాబీ అధిష్ఠానంభావించింది. అందుకే ఇంతకాలం లో-ప్రొఫైల్ మెయింటైన్ చేసిన కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి రోడ్లపైకి వస్తున్నారు.బీఆర్ఎస్ శ్రేణుల్లో ఈ వార్త కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ రెండు యాత్రల పూర్తిషెడ్యూల్, అధికారిక రూట్ మ్యాప్స్ త్వరలోనే విడుదల కానున్నాయి. మరి తండ్రీ కుమారుల స్ట్రాటజీ బీఆర్ఎస్‌ను మళ్లీ రేసులోకి తెస్తుందా? కాంగ్రెస్, బీజేపీల ముకుమ్మడి దాడిని తట్టుకుని గులాబీ పార్టీపూర్వ వైభవాన్ని సాధిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# దుమ్ము రేపిసిన పెద్ది...

**హైదరాబాద్, జూన్ 12, పెన్ పవర్:**
పెద్ది' జోరు బాక్స్ ఆఫీస్ వద్ద ఇప్పటికీ ఏ మాత్రం తగ్గలేదు. ఓవర్సీస్ , నార్త్ ఇండియా మార్కెట్స్ లో ఈ సినిమా డిజాస్టర్ ఫ్లాప్ గా నిల్చింది కానీ , తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇండస్ట్రీ హిట్ సినిమాకు ఏరేంజ్ వసూళ్లు వస్తాయో , అదే రేంజ్ వసూళ్లు నమోదు అవుతున్నాయి. దేవర , ఓజీ చిత్రాలను మాత్రమే కాదు , ఏకంగా #RRR రికార్డ్స్ ని కూడా ఈ సినిమా అనేక ప్రాంతాల్లో బద్దలుకొట్టి సంచలనంస్పృష్టించింది. డైరెక్టర్ బుచ్చి బాబు స్క్రీన్ ప్లే విషయం లో కాస్త తడబాటు పడినప్పటికీ కూడా, రామ్ చరణ్ అద్భుతమైన నటన తో ఈ సినిమాని వేరే లెవెల్ కి తీసుకెళ్లడం ఆడియన్స్ కి తెగ నచ్చేసింది. అందుకే ఈ చిత్రానికి ఈ స్థాయి వసూళ్లు నమోదు అవుతున్నాయి. 7 వ రోజున ఈ చిత్రానికి దాదాపుగా తెలుగు రాష్ట్రాల నుండి 4 కోట్ల రూపాయలకు పైగా షేర్ వసూళ్లు నమోదు అయ్యాయి. మొదటి ఒసోమవారం కూడా ఈ స్థాయి వసూళ్లు నమోదు అవ్వడం కష్టమైన ఈరోజుల్లో , 7 వ రోజున కూడా ఈ రేంజ్ వసూళ్లు రాబట్టడాన్ని చూస్తుంటే , ఈ సినిమా ఏ రేంజ్ సునామీ ని సృష్టిస్తూ ముందుకు దూసుకుపోతుందో అర్థం చేసుకోవచ్చువారం రోజుల థియేట్రికల్ రన్ ని పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి ప్రాంతాల వారీగా ఎంత షేర్ వసూళు వచ్చింది?, బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకొని లాభాల్లోకి అడుగుపెట్టాలంటే ఇంకా ఎంత వసూళ్లను రాబట్టాలి అనేది ఇప్పుడు మనం చూడబోతున్నాం. ముందుగా నైజాం ప్రాంతం గురించి ప్రత్యేకించి మాట్లాడుకోవాలి. మొదటి నుండి ఈ ప్రాంతం లో ఇలాంటి జానర్‌సినిమాలకు ఆదరణ కాస్త తక్కువే. అయినప్పటికీ కూడా ఈ చిత్రానికి కేవలం మొదటి వారం లోనే 46 కోట్ల 58 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. ఉత్తరాంధ్ర లో కూడా ఈ సినిమా జోరు ఏ మాత్రంతగ్గలేదు. కేవలం వారం రోజుల్లోనే 18 కోట్ల 33 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. ఈ ప్రాంతం లో బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అందుకుంది ఈ చిత్రం. ఇక సీడెడ్ ప్రాంతం విషయానికి వస్తే , వారం రోల్లో ఇక్కడ 17 కోట్ల 58 లక్షల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టింది.అదే విధంగా ఈస్ట్ గోదావరి నుండి 10 కోట్ల 86 లక్షలు , వెస్ట్ గోదావరి నుండి 7 కోట్ల 64 లక్షలు , గుంటూరు నుండి 11 కోట్ల 14లక్షలు, కృష్ణా జిల్లా నుండి 8 కోట్ల 67 లక్షలు, నెల్లూరు జిల్లా నుండి 4 కోట్ల 91 లక్షల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టి సంచలనం సృష్టించింది ఈ చిత్రం. ఓవరాల్ గా ఈ చిత్రానికి 125 కోట్ల 71 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు , 186 కోట్ల 60 లక్షల రూపాయిల గ్రాస్ వసూళ్లు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చాయి. అదే విధంగా కర్ణాటక ప్రాంతం నుండి 12 కోట్ల 55 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు ఈ చిత్రానికిరాగా, తమిళనాడు ం కేరళ నుండి 2 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. అదే విధంగా హిందీ ం రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 9 కోట్ల 45 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు రాగా, ఓవర్సీస్ నుండి 21 కోట్ల 10 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. ఓవరాల్ గా ఈ చిత్రానికి 170 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు , 282 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకోవడానికి మరో49 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టాల్సి ఉంటుంది.

# 19న హైదరాబాద్ కు పవన్...



**హైదరాబాద్, జూన్ 12, పెన్ పవర్:**
ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎంత యాక్టీవ్ గా ఉన్నాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఒకపక్క పాలన పరంగా తనదైన మార్కు తో ముందుకు వెళ్తూ , మరోపక్క జనసేన పార్టీ ని బలోపేతం చెయ్యడానికి అన్ని విధాలుగా ప్లానింగ్ చేస్తున్నాడు. జనసేన పార్టీ ని కేవలం ఆంధ్ర ప్రదేశ్ కి మాత్రమే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రాంతానికి కూడా విస్తరింపజేసే ప్రయత్నం చేస్తున్నాడు. రీసెంట్ గా పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సృష్టించిన అలజడి ఎలాంటిదో కళ్లారా చూసాము. కావాలని ఆయన్ని టార్గెట్ చేస్తూ , కాంగ్రెస్ పార్టీ జనసేన క్యాడర్ ని ,జనసేన నాయకులను తెలంగాణ వ్యాప్తంగా యాక్టీవ్ అయ్యేలా చేసింది. ఒకపక్క తెలంగాణ పై తన ఫోకస్ ప్రస్తుతానికి లేదని పవన్ కళ్యాణ్ చెప్తూనే , మరోపక్క అక్కడ ఆ పార్టీని బలోపేతం చేయడానికిఅన్ని విధాలుగా సిద్ధం అవుతున్నాడు.అందులో భాగంగా ఈ నెల 19 న ఆయన తెలంగాణ లో జనసేన పార్టీ పీకార్యాలయాన్ని గ్రాండ్ గా ప్రారంభించబోతున్నట్టు సమాచారం. ఏ ప్రాంతం లో ఆయన ఈకార్యాలయాన్ని ప్రారంభించబోతున్నాడు అనేది ప్రస్తుతానికి తెలియదు. మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. పవన్ కళ్యాణ్ కి ప్రస్తుతం తెలంగాణ మీద ఆసక్తిలేకపోయినప్పటికీ,జనసేన పార్టీ క్యాడర్ మాత్రం ఒప్పుకోవడం లేదు , ఎట్టి పరిస్థితిలోనూ తెలంగాణ లో జనసేన పార్టీ ని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాల్సిందే అని పవన్ పై ఒత్తిడి తెస్తున్నారు.అందుకే వాళ్ళ కోసం ఆయన ఇకపై తెలంగాణ పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాదు ఆయన రీసెంట్ గా జరిగిన ఒక ఇంటర్వ్యూ లో కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడడంచూస్తుంటే , రాబోయే రోజుల్లో ఆయన అధికార కాంగ్రెస్ ని చాలా గట్టిగానే టార్గెట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత మాత్రం నిజముందో చూడాలి.

# కాంగ్రెస్ లో ఇంటిదొంగలు



**హైదరాబాద్, జూన్ 12, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన, వ్యూహాత్మక మార్పు కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం భారత్ రాష్ట్ర సమితి విమర్శల బాణాలు ఎటువైపు వెళ్తున్నాయో గమనిస్తే ఒక స్పష్టమైన సంకేతంకనిపిస్తుంది. బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో గానీ, రాష్ట్ర స్థాయిలో గానీ కాంగ్రెస్ పార్టీని ఒక వ్యవస్థగా పెద్దగా టార్గెట్ చేయడం లేదు. వారి ఏకైక లక్ష్యం, నిరంతర దాడి కేవలం ముఖ్యమంత్రి ఎనుముల
రేవంత్ రెడ్డిపైనే కేంద్రీకృతమై ఉంది. తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన వివాదంలో కూడా బీఆర్ఎస్ నేతలు, రేవంత్ రెడ్డి వ్యతిరేకవర్గాలు దీనిని రేవంత్ కుట్రే అన్నట్లుగా ప్రొజెక్ట్ చేస్తుండటం ఈ వ్యూహానికి బలమైన నిదర్శనంగా నిలుస్తోంది.బీఆర్ఎస్ అధినాయకత్వానికి కాంగ్రెస్ భావజాలంపై కంటే రేవంత్ రెడ్డి శైలిపైనే ఎక్కువఅభ్యంతరాలు, భయాలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ముఖ్యమంత్రి అయ్యాక కూడా బీఆర్ఎస్‌ను రాజకీయంగా కోలుకోలేని దెబ్బతీయాలనే ఏకైక అజెండాతో దూకుడుగా ముందుకు వెళ్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు, కేసీఆర్ కుటుంబంపై విచారణలు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి అంశాలతో గులాబీ దళాన్ని రేవంత్ రక్షణలోపడేశారు. అందుకే బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే కేడర్‌లో పెద్దగా మైలేజ్ రాదని, రేవంత్ రెడ్డిని పర్సనల్‌గా బలహీనపరిస్తేనే తమకు మళ్లీ పూర్వవైభవం వస్తుందని బలంగా నమ్ముతోంది.తమకు రాజకీయంగా అడ్డుగా నిలిచిన ఏకైక పిల్లర్‌ను కూల్చడమే వారి ప్రధాన లక్ష్యంరాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలకమైన, నిజాయితీ గల నాయకురాలిగా పేరున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ సాంకేతిక కారణాల వల్ల తిరస్కరణకు గురవడం కాంగ్రెస్‌లో పెద్ద కలకలం రేపింది. సీఎం రేవంత్ దీనిని 'బీజేపీ కుట్ర, సీట్ల చోరీ' అని ఢిల్లీ వేదికగా కొట్లాడుతుంటే,ప్రతిపక్షాలు , రేవంత్ అంతర్గత శత్రువులు మాత్రం దీని వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందనే కోణాన్ని తెరపైకి తెస్తున్నారు. రాష్ట్రంలో తన పట్టుకు అడ్డుగా మారే అవకాశం ఉన్న ఢిల్లీ పెద్దలను, హైకమాండ్‌ప్రతినిధులను రేవంత్ రెడ్డి కావాలనే ఇబ్బందుల్లో నెడుతున్నారనే ప్రచారాన్ని బీఆర్ఎస్ గట్టిగా సమాజంలోకి పంపుతోంది. ఈ స్నాగ్ ఇష్యూ ద్వారా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద నమ్మకద్రోహిగా
నిలబెట్టాలనేది బీఆర్ఎస్ అసలు ప్లాన్.బీఆర్ఎస్ ఆలోచనల వెనుక ఒక లోతైన రాజకీయ లెక్క ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, ఆ పార్టీని నడిపించే 'ఇంజిన్'రేవంత్ రెడ్డే. ఆయన ఢిల్లీ హైకమాండ్ వద్ద బలహీనపడితే లేదా అధిష్ఠానం ఆయనపై నమ్మకం కోల్పోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న పాత అసమ్మతి నేతలు మళ్లీ తలలేపుతారు. తద్వారా కాంగ్రెస్ అంతర్గత
కుమ్ములాటలతో దానంతట అదే బలహీనపడుతుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. రేవంత్ రెడ్డిని దెబ్బతీస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ కోట కూలిపోతుంది అనే థియరీతోనే బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది.అందుకే వారు జాతీయ కాంగ్రెస్‌ను కాకుండా, కేవలం రేవంత్ చుట్టూనే రాజకీయ చక్రవ్యూహాన్ని రచిస్తున్నారు.రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద బలం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీల వద్ద ఉన్న నమ్మకం.
ఈ నమ్మకాన్ని చెడగొట్టడానికి బీఆర్ఎస్ నిరంతరం ప్రయత్నిస్తోంది. 'రేవంత్ రెడ్డి ఎప్పటికైనా కాంగ్రెస్‌కు ముప్పు', 'ఆయన తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారు', 'ఢిల్లీ పెద్దల నామినేషన్లు రద్దుకావడానికి ఆయనే కారణం' అనే నరేటివ్‌ను ఢిల్లీ స్థాయికి చేర్చడం ద్వారా రేవంత్ రెడ్డి పీఠాన్ని కదిలించవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. సీఎంను ఒంటరిని చేయడం ద్వారా, రాష్ట్రంలో కాంగ్రెస్ దూకుడుకు
బ్రేకులు వేయవచ్చని విపక్షం గట్టి వ్యూహాత్మక దాడి చేస్తోంది. ఎంత సక్సెస్ అవుతుందన్నది వేచి చూడాల్సిందే.

# గంజాయి విక్రయిస్తూ ఇద్దరు యువకులు అరెస్ట్,

## 1.70 కిలోల గంజాయి స్వాధీనం, రిమాండ్ కి తరలింపు

**మేడ్చల్: పెన్ పవర్:** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఖమ్మం పట్టణానికి చెందిన ధనుష్, లోకేష్ అనే ఇద్దరు యువకులు
గంజాయికి అలవాటు పడి, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకువచ్చి ఘట్కేసర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి 1 కిలో 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్ కేసర్ ఇన్స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

# తెలంగాణ ఫ్యూచర్ సిటీలో మరో 37 గ్రామాలు

**హైదరాబాద్, జూన్ 12, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీ దిశగా అడుగులుపడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనాన్నిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు రేవంత్ హాజరయ్యారు. ఈ సభ జరుగుతున్న సమయంలో కొంతమంది ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను కలపాలంటూప్లకార్డులు ప్రదర్శించారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క్ ఈ అంశాన్ని రేవంత్ దృష్టికి తీసుకెళ్లి సభావేదికపై నిర్ణయం ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలనుంచి వచ్చిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించారు. ప్రజలు రిక్వెస్ట్ చేస్తూ తీసుకొచ్చిన పత్రాలపై సంతకం చేసి 37 గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని అధికారుల్ని ఆదేశించారు. మహేశ్వరంమండలంలో ఉన్న 28 గ్రామాలు, కందుకూరులోని 9 గ్రామాలు కలిపి 37 గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో భాగం కానున్నాయి.అంతకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.20 కోట్లతో నిర్మించిన ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఛైర్మన్ హోదాలో తన ఛాంర్‌లో ఫైల్‌పై సంతకం చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పోర్టల్‌ను ప్రారంభించారు.సీఎం రేవంత్‌కు ప్రధాన కార్యకలాపాలను, విభాగాలను ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక వివరించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికుల కోరిక మేరకు తాజాగా కొన్ని గ్రామాలనుఫ్యూచర్ సిటీలో కలిపామని.. భవిష్యత్‌లో గ్రామాల వారీగా చర్చించి ఫ్యూచర్‌సిటీలో కలుపుతామని హామీ ఇచ్చారు. కొంతమంది అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్న?న్నారని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వాళ్లను ప్రజలు తిరస్కరించారని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే వారికి వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. ఫ్యూచర్ సిటీకి అడ్డుపడిన వారి సంగతి ప్రజలు చూసుకుంటారని.. వారే ఈ నగరాన్ని నిర్మించుకుంటారన్నారు.హైదరాబాద్‌లో భూముల ధరలు బాగా పెరిగాయని.. సైబరాబాద్ ఒక సాంకేతిక విప్లవంగా తెలంగాణముఖచిత్రాన్ని మార్చిందన్నారు రేవంత్ రెడ్డి. ఇప్పుడు భూమి ధర ఎకరా రూ.200 కోట్లకు పైగా పలుకుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా భూములకు బంగారం కంటే ఎక్కువ విలువ ఉందన్నారు. గతంలోహైటెక్ సిటీ అంటే నవ్వారని.. ఔటర్ రింగ్ రోడ్డును అడ్డుకున్నారన్నారు. గతంలోనూ నగర అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు, కుతంత్రాలు చేశారని ఆరోపించారు. గత పాలకులు హైటెక్ సిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జీనోమ్ వ్యాలీ వంటివి తీసుకురాకపోతే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వచ్చేవా అన్నారు. ప్రజలు ఈ విషయాలను ఆలోచించాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# రామచంద్రపూర్ లో ప్రత్యేక ప్రజా దర్బార్ పాల్గోన్న మంత్రి సీతక్కల



**ములుగు: పెన్ పవర్:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతువేదిక ప్రాంగణం లో ఏర్పాటు చేసినప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గోన్నారు. ఈ సందర్భంగా మల్లంపల్లి మండలం లోని గుర్తుర్ తండా, కొడిశలకుంట, ముద్దనూరు తండా, రామచంద్రపూర్, భూపాల్ నగర్, శివ తండ గ్రామ పంచాయతీల పరిధి గ్రామాల ప్రజల నుంచి మంత్రి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, డీఎఫ్ఓ వికాస్ మినా, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.,సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్చ, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి , ఆర్డీవో కృష్ణవేణి , పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి , సంబంధిత గ్రామాల సర్పంచ్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పలు పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క

**ములుగు పెన్ పవర్:** పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామ పరిధిలోని సీఆర్ఆర్ 2025-26 నిధులు రూ.19 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, ఆర్అండ్బీ రోడ్డు నుంచి దుర్గామాత టెంపుల్ వరకు సీఆర్ఆర్ 2025-26 నిధులు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, అలాగే రూ.10 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో నూతనంగా నిర్మించిన దుర్గామాత దేవాలయం కాంపౌండ్ వాల్ను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు.
తరువాత రం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి మెగా శానిటేషన్ డ్రైవ్లో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి , గ్రామ సర్పంచ్ దొంతి స్వరూప , స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోసాల క్యూనెట్.. ఇగ్నైట్ పేరుతో రూ.5వేల కోట్ల దోపిడీకి స్కెచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** తియ్యటి మాటలు చెప్పటం.. కళ్ల ముందే కలల ప్రపంచాన్ని క్రియేట్ చేయటం.. కాస్త కష్టపడితే చాలు.. లక్షలాది రూపాయిలు కుప్పలుకుప్పలుగా మీ ఇంటికి వస్తాయని చెబుతూ చీటింగ్ చేసే సంస్థల్లో ఒకటిగా క్యూనెట్ పేరును ప్రస్తావిస్తుంటారు సీనియర్ పోలీసు అధికారి కం హైదరబాద్ పోలీసు కమిషనర్ సజ్జన్నార్. గతంలోనూ ఆయన క్యూనెట్ మోసాల పరంపరకు చెక్ చెప్పే ప్రయత్నం చేశారు. దాదాపు పాతికేళ్ల పాటు దేశంలోని లక్షల మందిని ముంచిన ఈ క్యూనెట్ సంస్థ గుట్టు రట్టు చేయటంతో పాటు.. దాని దోపిడీని అడ్డుకట్ట వేసేందుకు సైబరాబాద్ పోలీసు కమిషనర్ గా ఉన్న వేళలో సజ్జన్నార్ చేసిన ప్రయత్నాలు అన్ని ఇన్ని కావు.ఈ సంస్థ చేసే మోసాలపై తరచూ చర్యలు తీసుకోవటంతో పాటు.. ఈ సంస్థ గురించి తెలియక భాగస్వామ్యం కావటం.. బ్రాండ్ అంబాసిడర్ లుగా ఉండే ఎంతోమంది సెలబ్రిటీలకు నోటీసులు పంపిన ఘన చరిత్ర సజ్జన్నార్ సొంతం. అలాంటి ఆయన తాజాగా మరోసారి క్యూనెట్ మోసాల పరంపరకు చెక్ చెబుతూ.. అందుకు కారణమైన నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సంచలన నిజాల్ని వెల్లడించారు. క్యూనెట్ మోసాలను బయటకు వచ్చేసిన నేపథ్యంలో.. సదరు సంస్థ ఇగ్నైట్ పేరుతో కొత్త ముసుగు వేసుకొని మార్కెట్ లోకి అడుగు పెట్టింది.మొత్తంగా రూ.5వేల కోట్ల మోసానికి ప్లాన్ చేసిన ఈ సంస్థ గుట్టును రట్టు చేశారు హైదరాబాద్ సీపీ సజ్జన్నార్. వివిధ రాష్ట్రాల్లో పాగా వేసిన ఇగ్నైట్ డైరెక్ట్ సెల్లింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాకు సంబంధించి కీలకమైన ఆరుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు.నోయిడాకు చెందిన ఒనియల్ గుప్తా.. యూపీలోని బులంద్ షహర్ కు చెందిన దినేష్ కుమార్ సాహిల్.. ప్రియాన్ష్ సక్సేనా.. కోల్ కతాకు చెందిన ప్రవీణ్.. పరితోష్ కుమార్.. కేరళకు చెందిన రియాజ్ లను అరెస్టు చేశారు. వీరంతా గతంలో క్యూనెట్ లో సీనియర్ లీడర్లుగా పని చేశారని.. ప్రస్తుతం వారంతా ఆయా రాష్ట్రాల్లో ఇగ్నైట్ సంస్థకు కీలక స్థానాల్లో ఉన్నట్లు చెప్పారు. హాంకాంగ్ ప్రధాన కేంద్రంగా ఉన్న ఇగ్నైట్ సంస్థను గత ఏడాది మే 18న చండీగఢ్ లో రిజిస్టర్ చేయించారని.. తక్కువ సమయంలో ఎక్కువమందిని ఈ సంస్థలో చేర్పించటం ద్వారా రూ.5వేల కోట్లు కొల్లగొట్టే ప్లాన్ వేసినట్లు ప్రకటించారు.చెన్నైకు చెందిన పత్మన్ సేనాధి రాజా గోల్డ్ క్వెస్ట్ పేరుతో సంస్థను నిర్వహించారు. పదికి పైగా దేశాల్లో బ్యాన్ ఎదుర్కొన్న ఈ సంస్థ కొన్ని లక్షల మందిని మోసం చేసింది. దీనిపై దేశ వ్యాప్తంగా 50వేల కేసులు నమోదయ్యాయి. కట్ చేస్తే.. ఇదే సంస్థ నిర్వాహకులు క్యూనెట్ పేరుతో డైరెక్ట్ సెల్లింగ్ పేరుతో మోసాలకు తెర తీశారు. వీరి మోసాలకు చెక్ చెప్పటంతో ఈసారి ఇగ్నైట్ పేరుతో మోసాలకు ప్లాన్ చేశారు. అయితే.. వీరి గుట్టు రట్టు చేయటంతో పాటు.. ఈ సంస్థకు చెందిన ముఖ్యుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా సీపీ సజ్జన్నార్ వెల్లడించారు. ఏమైనా.. ఇలాంటి మల్టీ లెవల్ మార్కెటింగ్ ఉదంతాల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఎవరీ లభీషా మీనా.. కేంద్రమంత్రిని ఆమె అడిగిన ప్రశ్నతో కోట్ల మందికి రిలీఫ్



**హైదరాబాద్ పెన్ పవర్:** నిన్నటి వరకు సాదాసాదీ రీసెర్చ్ స్కాలర్ ఇప్పుడు మెయిన్ స్ట్రీమ్ మీడియా సైతం ఆమె గురించి మాట్లాడుతోంది. సోషల్ మీడియాలో అయితే ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. లక్షలాది మంది నిత్యం ఎదుర్కొనే ఒక సమస్యను.. ధైర్యంగా కేంద్ర మంత్రి వద్ద ప్రస్తావించిన వైనం.. అందుకు ఆయన అంతే వేగంగా స్పందించిన తీరు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇంతకూ లభీషా మీనా ఎవరు? ఆమె ఏ సందర్భంలో.. ఏ అంశంపై కేంద్రమంత్రిని ప్రశ్నించింది? ఆ తర్వాత ఏమైంది? అన్న వివరాల్లోకి వెళితే..

రాజస్థాన్ రాజధాని జైపూర్ లోని ప్రతిష్ఠాత్మక మాలవ్య నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ఐటీ)లో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగంలో పీహెచ్ డీ చేస్తున్నారు. ఆమె ఒక సాదాసీదా విద్యార్థిని. అయితే.. తను చదువుతున్న విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ క్వాంటం కంప్యూటింగ్ ల్యాబ్ ను ప్రారంభించేందుకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వచ్చారు. సదరు కార్యక్రమం ముగిసిన తర్వాత ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా లభీషా మీనా అనే పీహెచ్ డీ స్కాలర్ మైక్ అందుకొని.. 'సార్, దయచేసి ఐఆర్ సీటీసీ వెబ్ సైట్ లో ఎదురవుతున్న క్యాప్చా, సర్వర్ క్రాష్, ఓటీపీల సమస్యను పరిష్కరించండి. తత్కాల్ సమయంలో సైట్ అస్సలు ఓపెన్ కావటం లేదు. సామాన్యులకు టికెట్లు దొరకటం లేదు' అంటూ ప్రశ్నించారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్.. వేదిక మీద ఉన్న తన మొబైల్ ఫోన్ చేసి ఐఆర్ సీటీసీ ఉన్నతాధికారులకు లైవ్ కాల్ చేశారు.సదరు అధికారితో మంత్రి మాట్లాడుతూ..

ఇక్కడ విద్యార్థులంతా ఐఆర్ సీటీసీ సరికొత్త వెబ్ సైట్ కావాలని గట్టిగా కోరుతున్నారు. మనం దీన్ని రాబోయే 30 రోజుల్లో తయారు చేయగలమా? అని ప్రశ్నించారు. దీనికి సదరు ఉన్నతాధికారి సానుకూలంగా స్పందించారు. దీంతో ఫోన్ పెట్టేసిన కేంద్రమంత్రి విద్యార్థులతో.. విద్యార్థుల అందరి డిమాండ్ మేరకు సరికొత్త సాంకేతికతతో కూడిన కొత్త ఐఆర్ సీటీసీ వెబ్ సైట్ రానుంది. రాబోయే 30 రోజుల్లో అంటే.. జులై 15న దీన్ని మేం లాంచ్ చేస్తామని ప్రకటించారు.దీంతో.. ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే మంత్రి స్పందించటమే కాదు.. తక్షణ పరిష్కారాన్ని చెప్పటం ఆసక్తికరంగా మారింది. దీనంతటికి కారణమైన విద్యార్థిని లభీషా మీనా ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నారు. ఈ ఉదంతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఒక అంచనా ప్రకారం రోజు దాదాపు 9 లక్షల టికెట్లను ఐఆర్ సీటీసీ ద్వారా ప్రయాణికులు బుక్ చేసుకుంటారని చెబుతుంటారు. ఇలా రోజుకు లక్షలాది మంది వినియోగించే సైట్ ఆధునీకరించే విషయంలో ఒక విద్యార్థి చూపించిన చొరవ ఎంతోమందికి మేలు కాబోతోంది.

# మళ్లీ కవ్విస్తున్న పాకిస్తాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఏడాది సరిగ్గా ఇదే సమయానికి పాకిస్థాన్ నెత్తినోరూ మొత్తుకుంది. బ్బాబ్బాబూ మమ్మల్ని వదిలేయండి మీకు దండం పెడతాం అంటూ కాళ్లు పట్టుకుంది. చచ్చిన పామును ఏం చంపుతామని భారత్‌బతుకుపో అంటూ వదిలిపెట్టింది. లేకుంటేనా పాకిస్థాన్ ప్రపంచ పటంలో ఉండేదే కాదు.భారత్ దయాదాక్షిణ్యాల మీద బతికిన పాకిస్థాన్ మళ్లీ పిచ్చి లేసిన కుక్క లాగా అరవడం మొదలుపెట్టింది. సరిహద్దుల్లోమళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నిబంధనలు అతిక్రమించి జమ్మూలో భారత సైన్యం ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్టుల ప్రాంతాలలో పాకిస్థాన్ సైన్యం ఈనెల 9న తెల్లవారుజామున డ్రోన్లనుపంపించింది.ఆ డ్రోన్లను కూల్చివేయడానికి భారత సైన్యం 15 రౌండ్ల పాటు కాల్పులు జరపాల్సి వచ్చింది. అయితే ఆ డ్రోన్లు మళ్లీ పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లిపోయాయి. ప్రతిసారీ నిబంధనలు అతిక్రమించడంపాకిస్థాన్ కు అలవాటే. కాకపోతే పహల్గాం ఘటన తర్వాత భారత్ కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేస్తోంది. సరిహద్దుల్లో చీమచిటుక్కుమన్నా తెలిసేలా సెక్యూరిటీ ఏర్పాటు చేసింది. అందువల్లే పాకిస్థాన్ డ్రోన్లపై భారత్ కాల్పులు జరిపింది.ఇలాంటి పనులు పాకిస్థాన్ ఎందుకు చేస్తోందంటే..ప్రస్తుతం పాకిస్థాన్ లో అంతర్గత సంక్షోభాలు ఏర్పడ్డాయి. భారత్ జీలం, చినాబ్ నది ప్రవాహాలకు అడ్డుకట్ట వేసింది. దీంతోపాకిస్థాన్ లో వ్యవసాయం సాగే పరిస్థితి లేదు. పీవోకే లో పాకిస్థాన్ కు వ్యతిరేకంగా ఆందోళన లు జరుగుతున్నాయి. బలూచిస్థాన్ ఆర్మీ పాకిస్థాన్ కు చుక్కలు చూపిస్తోంది. ఆర్థిక సంక్షోభం కూడా పాకిస్థాన్ పాలకులను కలవరపాటుకు గురి చేస్తోంది.ఇవన్నీతగ్గిపోవాలంటే ఏదోఒకటి చేయాలి. భారత్ మీద దాడులు చేసినట్టు కలరింగ్ ఇస్తే అంతర్గత సంక్షోభాలను డైవర్ట్ చేయవచ్చని పాకిస్థాన్ భావిస్తోంది. అయితేఆపరేషన్ సిందూరు జస్ట్ శాంపిల్ మాత్రమేనని..ఈసారి పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వితే.. లేపడానికి కాలు..దువ్వాడానికి చేయి ఉండవని భారతసైన్యం స్పష్టం చేస్తోంది.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన



**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు."బాల్యం ప్రతి చిన్నారి జన్మహక్కు. చదువుకోవడం, ఆడుకోవడం, ఆనందంగా ఎదగడం, తమ కలలను సాకారం చేసుకునే అవకాశాలు పొందడం ప్రతి పిల్లవాడి సహజ హక్కు. ఆ హక్కులను హరించే బాలకార్మిక వ్యవస్థకు సమాజంలో చోటు లేకుండా చేయడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదే సమయంలో కుటుంబాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛందసంస్థలు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి పౌరుడు ఈ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.బాల కార్మిక వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదని, ఎక్కడైనా చిన్నారులు పనుల్లో నిమగ్నమైనా, కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఒక చిన్నారిని బాల కార్మికత్వం నుంచి బయటకు తీసుకురావడం అంటే అతనికి లేదా ఆమెకు ఒక కొత్త భవిష్యత్తును అందించినట్టేనని పేర్కొన్నారు."పిల్లల చేతుల్లో పనిముట్లు కాదు.. పుస్తకాలు ఉండాలి. వారి భుజాలపై భారం కాదు.. భవిష్యత్తుపై ఆశలు ఉండాలి. ప్రతి చిన్నారి నవ్వుతూ, నేర్చుకుంటూ, కలలు కంటూ ఎదిగే తెలంగాణను నిర్మించడమనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

# 14న కాక్ రోచ్ పార్టీ నిరసన



**హైదరాబాద్ పెన్ పవర్:**
దేశ రాజకీయాల్లో ' కాక్రోచ్ జనతా పార్టీ ' ఓ సంచలనం. ఓ కేసులో నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్న జీవులు'తో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పోల్చడంతోసీజేపీ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే ప్రధాన రాజకీయ పార్టీలకు మించి ఫోలోవర్లు వచ్చారు. ఐదు రోజుల వ్యవధిలోనే రెండు కోట్ల మంది ఫాలోవర్లకు చేరుకున్నారు.
దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి యువతలో అసంతృప్తి ఎలా ఎగిసిపడుతుందనడానికి ఇదే ఓ మచ్చు తునక. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై రాజధానిలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేనాయకత్వంలో మొదటిసారి ప్రత్యక్ష నిరసన చేపట్టారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ దేశవ్యాప్త ఆందోళన చేపడతామని ఆ ధర్నాలోనే దీప్కే ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో సీజేపీ తొలినిరసన జూన్ 14న హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చేపట్టనుంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షా విధానాలలో సంస్కరణలు కోరుతూ చేపట్టిన 'గోయింగ్ నేషనల్' ఉద్యమంలో ఈఆందోళనలు ఒక భాగమని సీజేపీ చెబుతోంది. సీజేపీ విడుదల చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నిరసన జూన్ 14న ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో జరగనుంది. విద్యార్థిసంఘాలు, పౌర సమాజ సభ్యులు ఇందులో పాల్గొంటారని అంచనాతో శాంతియుత ప్రదర్శనకు పిలుపునిచ్చారు.అదే రోజున సాయంత్రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో భారీ నిరసన జరుగుతుందనితెలిపింది. దక్షిణాదిన విస్తరణలో భాగంగా ఈ రెండు నిరసనలు చేపట్టినట్టు సీజేపీ పేర్కొంది. జూన్ 11న మహారాష్ట్రలోని పుణేలో నిరసన చేపట్టింది. జూన్ 12న ఉత్తర్ ప్రదేశ్ లక్నో (ఇకో గార్డెన్)లో,పంజాబ్‌లో జూన్ 13న అమృత్‌సర్‌లో, జూన్ 14 హైదరాబాద్, బెంగళూరు, జూన్ 15న రాజస్థాన్ రాజధాని జైపూర్, జూన్ 20 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తామనివెల్లడించింది.ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల జాప్యం, నియామకాలు, ప్రవేశ పరీక్షలలో పారదర్శకత లోపించడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ నిరసనల లక్ష్యమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద

జరగనున్న నిరసన ఈ ఉద్యమంలో చివరి, అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. విద్యా రంగంలోని వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యుడిగా భావిస్తున్న విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమడిమాండ్లు నెరవేరే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని దీప్కే పేర్కొన్నారు.ఇటీవలి నిరసనలలో విద్యార్థులు, యంగ్ ప్రొఫెషనల్స్, పౌర సమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు కూడాహాజరైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. వీరిలో చాలామంది మాస్కులు ధరించి, ప్లకార్డులతో నిరసనలలో పాల్గొనడం సీజేపీకి పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు నిరసనలు దక్షిణాదికికూడా విస్తరిస్తున్నందున జూన్ 20న ఢిల్లీలో జరిగే ముగింపు ర్యాలీకి ముందు దేశవ్యాప్తంగా ఊపును తీసుకొచ్చేందుకు సీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు.

# 824 నియోజకవర్గాల పెంపునకు ఈసీ ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, జూన్ 12, పెన్ పవర్:**
దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని ఆర్థిక సలహా మండలి కీలక ప్రతిపాదనలు చేసింది. జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా పట్టణీకరణ, ఎస్సీ-ఎస్టీ జనాభా, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కొత్త నియోజకవర్గాల ఏర్పాటు చేపట్టాలని సూచించింది. ముఖ్యంగా చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో అక్కడి
లోక్‌సభ స్థానాలను రెట్టింపు చేయాలని సిఫార్సు చేసింది.ప్రస్తుతం దేశంలో 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, తాజా ప్రతిపాదనలు అమలైతే వాటి సంఖ్య 824కు చేరే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాల్లోప్రస్తుతం ఉన్న సీట్లను సుమారు 50 శాతం వరకు పెంచే విధంగా మోడల్‌ను రూపొందించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 170 నియోజకవర్గాలను పునర్విభజించాలని నివేదిక పేర్కొంది. వీటిలో 59నియోజకవర్గాలను రెండు భాగాలుగా, 111 నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వెల్లడించింది.కొత్త ప్రతిపాదనల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఎంపీ స్థానాల సంఖ్యగణనీయంగా పెరగనుంది. అయితే మొత్తం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం ప్రస్తుతం ఉన్న 23.7 శాతం స్థాయిలోనే కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించారు. కేరళలో ప్రస్తుతం ఉన్న20 స్థానాలు 30కు, తమిళనాడులో 39 స్థానాలు 59కు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా అదనపు లోక్‌సభ స్థానాలు లభించే అవకాశముంది.దేశంలోనే అత్యధికోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 80 స్థానాలు 120కు పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. చిన్న నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజాప్రాతినిధ్యం మరింత మెరుగుపడటంతోపాటు దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం సుమారు 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సలహా మండలి అంచనా వేసింది.ఇక పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా'మహిళా పోలింగ్ బూత్‌లు' ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. అలాగే 2027 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని కమిటీ స్పష్టంచేసింది. ఈ ప్రతిపాదనలు అమలైతే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# అన్న లేని లోటు తీర్చిన పవన్ అన్న.. లోకేశ్ ఎమోషనల్ స్పీచ్, జగన్‌పై స్ట్రాంగ్ కౌంటర్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి వేదికగా శుక్రవారం "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహా కూటమి అగ్రనేతలు హాజరైన ఈ సభలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన ప్రసంగం సభలో ఊపు తెచ్చింది. ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డిపై తనదైన శైలిలో ఘాటు విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో తనకున్న ఆత్మీయ బంధాన్ని పంచుకుని అందరినీ ఆకట్టుకున్నారు.



**పవన్ అన్న అంటూ పొగడ్తలు**

మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై తనకున్న గౌరవాన్ని, అభిమానాన్ని బహిరంగంగా చాటుకున్నారు. "నాకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత ఎన్నికల ముందు నుంచి కూటమి విజయం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కళ్యాణ్ పడిన తపనను లోకేశ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను కేవలం ఒక రాజకీయ భాగస్వామిగా కాకుండా, కుటుంబ సభ్యునిగా, ఒక అన్నగా భావిస్తానని చెప్పడం ద్వారా కూటమి నేతల మధ్య ఉన్న బలమైన అంతర్గత బంధాన్ని ఆయన మరోసారి చాటిచెప్పారని అంటున్నారు. లోకేశ్ ఈ వ్యాఖ్యలు చేస్తుండగా సభకు వచ్చిన కార్యకర్తల నుంచి ఈలలు, కేకలతో భారీ స్పందన లభించింది.

**జగన్‌పై పొలిటికల్ పంచ్‌లు**

కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల విజయాలను వివరిస్తూనే, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి లోకేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను వేధించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. "10వ తరగతి పేపర్ లీక్ చేసినప్పుడు టీచర్లు జగన్‌ను చితకబాదారు. ఆ కోపం మనసులో పెట్టుకునే ఆయనకు టీచర్స్ అంటే పడదు.. అందుకే గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను మద్యం షాపుల దగ్గర కాపలాగా నుంచోబెట్టాడు" అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు పూర్తి గౌరవం కల్పిస్తున్నామని, విద్యా వ్యవస్థను సంస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగడుతూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**కూటమి పాలన నిరంతరాయంగా సాగాలి:**

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. ఏపీ భవిష్యత్తు మారాలంటే కూటమి ప్రభుత్వం నిరంతరాయంగా కొనసాగాలని లోకేశ్ పిలుపునిచ్చారు. చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రధాని మోదీ అండదండలతో ఆంధ్రప్రదేశ్ మళ్లీ గాడిన పడిందని, ఈ అభివృద్ధి ప్రస్థానం ఇలాగే ముందుకు సాగాలంటే కూటమికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. తిరుపతి వేదికగా జరిగిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం' సభ కూటమిలో తిరుగులేని ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని చెబుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య మరింత సమన్వయాన్ని, బలాన్ని పెంచేలా నేతలు ప్రసంగించారని వ్యాఖ్యానిస్తున్నారు.

# చిన్న దేశాలే సాధించాయి.. మనకెందుకు దక్కలేదు? భారత ఫుట్‌బాల్ కల నెరవేరేది ఎప్పుడు?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఫుట్‌బాల్ పండుగగా పేరొందిన ఫిఫా వరల్డ్‌కప్ సమయం వచ్చిందంటే చాలు ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగుతుంది. కోట్లాది మంది అభిమానులు తమ ఫేవరెట్ జట్ల విజయాల కోసం ఎదురుచూస్తుంటారు. సోషల్ మీడియా నుంచి వీధుల వరకు ఎక్కడ చూసినా ఫుట్‌బాల్ జ్వరమే కనిపిస్తుంది.అయితే 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన యువశక్తి, ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా మార్కెట్లలో ఒకటైన భారత్ మాత్రం ఇప్పటికీ ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేకపోవడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి ఆవేదనకు గురిచేసే విషయమే.



**జనాభా భారీ.. ఫలితం శూన్యం!**

భారత్ ప్రస్తుతం ఫిఫా ర్యాంకింగ్స్‌లో 138వ స్థానంలో కొనసాగుతోంది. క్రికెట్‌లో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో ఉన్న మన దేశం, ఫుట్‌బాల్‌లో మాత్రం ఇంకా పునాది దశలోనే ఉందనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచ పటంలో చాలా చిన్న దేశాలు కూడా వరల్డ్‌కప్‌లో పాల్గొన్న చరిత్ర కలిగి ఉండగా భారత్ మాత్రం దీనిని ఇప్పటికీ ఒక కలగానే మిగిల్చుకుంది.

**చిన్న దేశాల సంచలనం.. భారత్ ఎందుకు వెనుకబడింది?**

మన దేశంలోని ఒక చిన్న జిల్లా అంత విస్తీర్ణం లేదా జనాభా కూడా లేని దేశాలు ప్రపంచ ఫుట్‌బాల్‌లో తమ ముద్ర వేశాయి. ఉదాహరణకు ఐస్లాండ్ కేవలం కొన్ని లక్షల జనాభా ఉన్నప్పటికీ 2018 ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ట్రినిడాడ్ అండ్ టొబాగో అత్యంత తక్కువ జనాభాతోనే వరల్డ్‌కప్ వేదికపై మెరిసింది. పరాగ్వే పలుమార్లు ప్రపంచకప్‌లో పాల్గొనడమే కాకుండా నాకౌట్ దశలకు కూడా చేరింది. కురాకావో, కేప్ వెర్డే ఈ చిన్న దేశాలు సైతం అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన చేస్తున్నాయి. ఈ దేశాల విజయాలను బట్టి చూస్తే ఒక దేశం ఫుట్‌బాల్‌లో గెలవడానికి 'జనాభా' ముఖ్యం కాదు.. అక్కడ ఉన్న 'క్రీడా వ్యవస్థే' అత్యంత కీలకమని స్పష్టమవుతోంది.

**భారత్ వెనుకబడటానికి ప్రధాన కారణాలు**

భారతదేశంలో ఫుట్‌బాల్ ఆట ఆశించిన స్థాయిలో ఎదగకపోవడానికి క్రీడా విశ్లేషకులు కొన్ని ముఖ్యమైన కారణాలను చెప్తున్నారు.. భారత్‌లో క్రీడ అంటేనే ముందుగా గుర్తొచ్చేది క్రికెట్. మీడియా దృష్టి, కార్పొరేట్ పెట్టుబడులు, స్పాన్సర్‌షిప్‌లు అభిమానుల ఆదరణ అంతా క్రికెట్‌కే దక్కుతోంది. దీంతో ఫుట్‌బాల్‌కు అందాల్సిన స్థాయి ప్రోత్సాహం, నిధులు లభించడం లేదు.

**మౌలిక సదుపాయాల కొరత**

గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు మన దేశంలో ఫుట్‌బాల్ మైదానాలు, అత్యాధునిక శిక్షణా కేంద్రాలు, అకాడమీలు తగినంతగా లేవు. ప్రతిభ ఉన్నా సరే సరైన సదుపాయాలు లేక ఎంతోమంది యువ క్రీడాకారులు మధ్యలోనే ఆటను వదిలేస్తున్నారు.

**గ్రాస్‌రూట్ వ్యవస్థ బలహీనత**

యూరప్, దక్షిణ అమెరికా దేశాల్లో 5–6 ఏళ్ల చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ఫుట్‌బాల్ నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తారు. కానీ భారత్‌లో స్కూల్, కాలేజ్ స్థాయిలో సమగ్రమైన ఫుట్‌బాల్ నిర్మాణం ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదు.

**లీగ్ వ్యవస్థ పరిమిత ప్రభావం**

ఇండియన్ సూపర్ లీగ్ వంటి టోర్నీలు ప్రారంభమయ్యాక భారత్‌లో ఫుట్‌బాల్‌కు కొంత ఊపు వచ్చినప్పటికీ, అవి జాతీయ జట్టు స్థాయిలో పెద్దగా ఫలితాలు సాధించడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది.

**ఆశలు ఇంకా సజీవమే!**

గత కొన్నేళ్లుగా భారత ఫుట్‌బాల్ రంగాన్ని గమనిస్తే కొన్ని సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇది అభిమానుల్లో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది. యువ ఆటగాళ్లు విదేశీ క్లబ్‌ల ట్రయల్స్‌కు వెళ్తుండటం... దేశవ్యాప్తంగా ప్రైవేట్ ఫుట్‌బాల్ అకాడమీల సంఖ్య పెరగడం... మహిళా ఫుట్‌బాల్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రదర్శన ఇస్తుండటం. భారత్‌లో ఫుట్‌బాల్ అభివృద్ధికి 'ఫిఫా' సైతం ప్రత్యేక ప్రాజెక్టులను ప్రోత్సహిస్తూ మద్దతుగా నిలవడం ముఖ్యం..

**2030 లేదా 2034 లక్ష్యంగా ముందుకు..**

ఫిఫా వరల్డ్‌కప్‌లో జట్ల సంఖ్యను 48కి పెంచడం భారత్‌కు ఒక సువర్ణ అవకాశంగా మారింది. దీనివల్ల ఆసియా ఖండం నుంచి మరికొన్ని ఎక్కువ జట్లకు అవకాశం దక్కుతుంది. సరైన ప్రణాళిక, దీర్ఘకాలిక పెట్టుబడులు, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభను వెలికితీసే వ్యవస్థను ఏర్పాటు చేస్తే.. వచ్చే దశాబ్దంలో 2030 లేదా 2034 కల్లా భారత్ కూడా ప్రపంచకప్ వేదికపై గర్జించే అవకాశం ఉంది.

140 కోట్ల జనాభా ఉన్న దేశం వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేకపోవడం కేవలం సంఖ్యల వైఫల్యం కాదు. అది మన క్రీడా విధానాలు, మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలిక ప్రణాళికల లోపానికి అద్దం పడుతోంది. చిన్న చిన్న దేశాలు సాధించిన విజయాలే భారత్‌కు పెద్ద ప్రేరణ కావాలి. ప్రతిభకు సరైన అవకాశాలు, శిక్షణకు ప్రభుత్వ–కార్పొరేట్ మద్దతు లభిస్తే... భారత్ వరల్డ్‌కప్ ఆడటం 'ఎప్పుడో ఒక రోజు' అనే ఆశ నుంచి, 'త్వరలోనే' అనే నమ్మకంగా మారడం ఖాయం!

# మూడేళ్ల వరకు బాదుడు ఉండదు.. మంత్రి గొట్టిపాటి రవి బంపర్ ఆఫర్



**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు శుభవార్త చెప్పింది. గత ప్రభుత్వ హయాంలో 'ట్రూ అప్' చార్జీల పేరిట ప్రజలపై మోపిన అదనపు భారాన్ని తగ్గిస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'ట్రూ డౌన్' వరాలను ప్రకటించింది. గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్‌కు, ఆ తర్వాత కాలంలో ప్రభుత్వాలు పెంచిన అదనపు బిల్లులను కలిపి వసూలు చేసేవి. దీనిని బిల్లులో ట్రూ అప్ చార్జీలుగా చూపేవారు. ఇలా గత ప్రభుత్వంలో ఏకంగా 9 సార్లు ట్రూ అప్ చార్జీలను వసూలు చేసినట్లు ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇప్పుడు ఈ చార్జీలను వసూలు చేయకపోగా, 'ట్రూ డౌన్' విధానాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి గొట్టిపాటి రవి తాజాగా ప్రకటించారు.గతంలో వినియోగదారులు చెల్లించిన అదనపు బిల్లులను గుర్తించి ఆ మొత్తాన్ని తగ్గిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం యూనిట్‌కు 13 పైసల చొప్పున చార్జీలు తగ్గాయని మంత్రి గొట్టిపాటి రవి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రి గొట్టిపాటి శుక్రవారం ఒక సంచలన ప్రకటన చేశారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలను పెంచలేదని గుర్తుచేశారు. రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీలను పెంచబోమని స్పష్టం చేశారు. ఎప్పుడో వాడిన కరెంట్‌కు అధిక బిల్లులు వసూలు చేసిన చరిత్ర వైసీపీదైతే.. ప్రజలు కట్టిన అదనపు సొమ్మును తిరిగి తగ్గిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానిదని ఆయన లాజిక్‌తో సహా వివరించారు. ఇదే నిజమైన సంక్షేమ పాలన అని మంత్రి పేర్కొన్నారు.

**విపక్షానికి గట్టి కౌంటర్**

కూటమి పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఒకవైపు వైసీపీ 'వెన్నుపోటుకు రెండేళ్లు' అంటూ ఆందోళనలు చేస్తుంటే.. అదే రోజు మంత్రి గొట్టిపాటి 'ట్రూ డౌన్' వివరాలను బయటపెట్టి విపక్షానికి గట్టి షాక్ ఇచ్చారని వ్యాఖ్యానిస్తున్నారు. ఐదేళ్లలో 9 సార్లు రేట్లు పెంచిన వారికీ, రెండేళ్లుగా రూపాయి పెంచకుండా పైగా బిల్లులు తగ్గిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, ఏపీలో 'ట్రూ అప్' బాదుడు కాలం పోయి, 'ట్రూ డౌన్' ఊరట కాలం వచ్చిందని మంత్రి తన ప్రకటనలో వివరించారని అంటున్నారు.

# కూటమికి 'కాపు గర్జన' సంకేతాలు!

**విజయవాడ, జూన్ 12, పెన్ పవర్:** ఏపీలో కాపులు ఇప్పుడు తెరపైకి వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అందులో భాగంగా తూర్పుగోదావరిలో కాపుల మహా గర్జన జరిగింది. అయితే ఇది కూటమికి ఒక హెచ్చరిక లాంటిది. ప్రస్తుతం కాపులకు ఉన్న ఏకైక ఆప్షన్ కూడా కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో కాపులు లేరు. ఒకసారి కాపులు ఆ పార్టీని నమ్మారు. జగన్మోహన్ రెడ్డి కొత్తగా ఏం చేయకపోగా.. కాపులకు సంబంధించి వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ పర్యవసానాలే ఆ పార్టీకి కాపులు దూరమయ్యారు. అప్పుడే వారంతా పవన్ కళ్యాణ్ వైపు టర్న్ అయ్యారు. అలా కూటమి వైపు అడుగులు వేశారు. అయితే ఇప్పుడు కూటమి పాలన రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో కాపులు తమ సమస్యలను పరిష్కరించాలని.. తమకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమ బాట పడుతుండడం విశేషం.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో కాపుల ఆలోచన మారే పరిస్థితి లేదు. ఎందుకంటే కాపుల రిజర్వేషన్లు అమలు చేయలేను అంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పారు. అంతకుముందు చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన ఐదు శాతం ఈ బి సి రిజర్వేషన్లను సైతం రద్దు చేశారు. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ ఆర్థికపరమైన రిజర్వేషన్లను ఐదు శాతం ఇచ్చారు అప్పట్లో చంద్రబాబు. కానీ నేరుగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేపట్టారు. అయితే అది రాజకీయ ప్రేరేపిత ఉద్యమమని తదనంతర పరిణామాల్లో తెలుసుకున్నారు కాపులు. అదే ముద్రగడ రాజకీయ ప్రేరేపితంలో భాగంగానే చేశారని ఆయన వైసీపీలోకి వెళ్లిన తర్వాత అర్థం అయింది. అయితే ఇప్పుడు కాపులు ఆర్థికపరమైన రిజర్వేషన్లు ఇచ్చిన కొంతవరకు సంతృప్తి పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అది నెరవేర్చే ఛాన్స్ కూడా కనిపిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న కాపుల ఆందోళన కార్యక్రమాల్లో ఒక అర్థం ఉంది. దానిని అర్థం చేసుకునే పనిలో ఉంది కూటమి ప్రభుత్వం. గత మాదిరిగా ఈ బీసీ రిజర్వేషన్లు ఇస్తే మిగతా సామాజిక వర్గాలు వ్యతిరేకించే అవకాశం లేదు. అయితే గతసారి ఐదు శాతం ఇచ్చారు. ఈసారి మాత్రం 10% ఈ బీసీ రిజర్వేషన్లు ఇవ్వచ్చు. ఆపై నామినేటెడ్ పోస్టులతో పాటు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల్లో కాపులకు సింహభాగం ప్రయోజనాలు కల్పించవచ్చు. ఒకవైపు సామాజిక వర్గానికి ఆర్థికపరమైన పథకాలు కూడా అందించవచ్చు. సామాజిక వర్గ నేతలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచవచ్చు. మరి ఇంతకంటే ఏం చేయగలరు. అయితే వైసీపీలో ఉన్న కాపు నేతలు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లేవర్ ఉన్న నేతల ప్రకటనలకు భిన్నంగా.. కూటమిని అలెర్ట్ చేసేందుకే ఈ కాపు గర్జనలు అని స్పష్టమవుతోంది. అయితే దీనిని మేల్కొని కూటమి ప్రభుత్వం కాపుల అభిమానాన్ని చూరగుంటే వైసిపి చేసే ప్రయత్నాలు ఏవి ఫలించవు కూడా.

# కర్ణాటక నుంచి అనంత... వేలాది కోట్ల రూపాయిల పెట్టుబడి

**అనంతపురం, జూన్ 12, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ముగ్గురు మనోళ్ల ప్రాణాలు తీసిన అమెరికా దాడి.. నిబంధనలు చెప్పేదేంటి?

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ఒమన్ తీరంలో అమెరికా సైన్యం దాడి జరిపింది. పలావు (దేశం) జాతీయ పతాకంతో ప్రయాణిస్తున్న ఎంటీ సెట్టెబెల్లో అనే చమురు రవాణా నౌకపై అమెరికా దాడి చేయగా.. సదరు రవాణా నౌకలోని ముగ్గురు భారతీయ సిబ్బంది మరణించారు ఇది నిన్నటి వార్తగా విన్నాం . ఇరాన్ - అమెరికా యుద్ధం నేపథ్యంలో అగ్రరాజ్యం విధించిన నౌకాదళ దిగ్బంధాన్ని ఉల్లంఘించి.. ఇరాన్ నుంచి చమురును రవాణా చేస్తుందన్నది అమెరికా ఆరోపణ.

ఈ నేపథ్యంలో తాము విధించిన దిగ్బంధాన్ని ఉల్లంఘించి ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నారన్న ఆరోపణలతో అమెరికా సెంట్రల్ కమాండ్ దళాలు ఒమన్ గల్ఫ్ సమీపంలో వాణిజ్య నౌక ఇంజిన్ రూంను టార్గెట్ చేసుకొని క్షిపణి దాడి చేశారు. ఈ ఉదంతంలో ముగ్గురు భారతీయ సిబ్బంది మృతి చెందారు. డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ.. ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా.. చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్. మరణించిన ముగ్గురిలో ఒకరు ఏపీకి చెందిన వారు. నౌకలో మిగిలిన 21 మంది సురక్షితంగానే ఉన్నారు. ఈ ఉదంతంపై భారత్ అమెరికాకు తన ఆందోళనను వ్యక్తం చేసింది.

ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ ఉన్నతాధికారిని పిలిపించిన భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేయటంతో పాటు.. వాణిజ్య నౌకలపై ఇలాంటి దాడులను వెంటనే ఆపేయాలని డిమాండ్ చేసింది. ఇలాంటప్పుడు వచ్చే కొన్ని సందేహాల్లో ముఖ్యమైంది? మనోళ్లు జాగ్రత్తలు తీసుకోలేదా? అని..అయితే.. ఇక్కడ సిబ్బంది పాత్ర కంటే కూడా వారు పని చేసే వాణిజ్య నౌకలను నిర్వహించే సంస్థ ఆదేశాలకు అనుగుణంగా పని చేయాల్సి ఉంటుంది. తాజా ఉదంతంలో ఇదే జరిగింది. అమెరికా మన మిత్రదేశం కదా? మరి దాడికి ఎందుకు చేశారు? దాడికి ముందు ముందస్తు హెచ్చరికలు చేశారా? అంటే.. చేసినట్లుగా అమెరికా చెబుతోంది. అయినా.. తమ హెచ్చరికల్ని పాటించకుండా ముందుకు వెళ్లటంతో దాడి చేసినట్లుగా చెబుతోంది. అదే సమయంలో నౌక మీద భారత జాతీయ పతాకం లేదు. కారణం.. ఇది పలావు అనే దేశానికి చెందింది. ఇక్కడే మరో సందేహం వస్తుంది. మనం అమెరికా రాయబారి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారిని పిలిపించి తీవ్ర నిరసన తెలియజేశాం.

ఒకవేళ ఇలాంటి పరిస్థితి రివర్సులో జరిగి.. మనోళ్లు జరిపిన దాడిలో ముగ్గురు అమెరికన్లు చనిపోయి ఉంటే ఏం జరిగేది? అన్న ప్రశ్న వేసుకుంటే.. అమెరికా వేరేలా స్పందించేది. తక్షణం వాషింగ్టన్ లోని భారత రాయబారిని అమెరికా విదేశాంగ శాఖ తక్షణ పిలిపించి.. తీవ్రంగా నిలదీసేది. వైట్ హౌస్.. పెంగాన్ నుంచి భారత్ కు వ్యతిరేకంగా అత్యంత కఠిన పదాలతో కూడిన సందేహం విడుదలై ఉండేది. అక్కడితో ఆగకుండా.. భారత్ తో ఉన్న రక్షణ ఒప్పందాలు.. అత్యాధునిక సాంకేతిక బదిలీ లాంటి ఒప్పందాలను అమెరికా తాత్కాలికంగా నిలిపివేస్తామని వార్నింగ్ ఇచ్చేది. అవసరమైతే.. కొన్ని కఠిన నిబందనల్ని తీసుకొచ్చి.. వాణిజ్యంపై ఒత్తిడి తెచ్చేది.ఇదంతా ఒక ఎత్తు అయితే.. నిజంగానే అమెరికాకు క్షిపణి దాడి తప్పించి..వేరే ప్రత్యామ్నాయం లేదా? అన్న ప్రశ్నతో పాటు.. అంతర్జాతీయ నిబంధనలు ఏం ఉన్నాయి? అన్నది చూస్తే... అమెరికా అహంకారం ఇట్టే అర్థమవుతుంది. క్షిపణి దాడి కాకుండా అమెరికా ఏం చేయొచ్చు? అన్నది చూస్తే.. మూడు ప్రాణాలు తీసిన అగ్రరాజ్య దుర్మార్గం ఇట్టే అర్థమవుతుంది.

అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం నిబంధనల్ని పాటించని వాణిజ్య నౌకలను సముద్రంలోనే నిలిపివేసే వీలుంది. లేదంటే.. జప్తు చేసే అవకాశం ఉంది. యుద్ధ క్షిపణులతో దాడి చేయటం కాకుండా.. ప్రత్యామ్నాయాలను ఎందుకు వాడలేదని ప్రశ్నించే వీలుంది. అంతేకాదు.. ఏ బ్లాక్ లిస్ట్ లో లేని వాణిజ్య నౌకలపై అమెరికా ఏకపక్షంగా దాడులు చేయటం అంతర్జాతీయ వాణిజ్య నియమాలకు విరుద్ధంగా చెప్పొచ్చు. తాము క్షిపణి దాడి జరిపిన నౌకలో భారత సిబ్బంది ఉన్నారని.. సిబ్బంది వివరాలు కూడా అమెరికా నౌకాదళానికి తెలుసని భారత నావికుల సంఘాలు చెబుతున్నాయి.అమెరికా చర్యపై ప్రధాని నరేంద్రమోడీ బహిరంగంగా ఖండించి ఉండే వీలుంది. కాకుంటే.. అమెరికాతో వ్యవహారించే తీరు వేళ.. వ్యూహాత్మక మౌనమే మంచిదన్న అభిప్రాయం ఉంది. అమెరికాపై ప్రపంచ దేశాల ఒత్తిడిని తీసుకొచ్చేలా చొరవ చూపి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం ఉంది. అమెరికాను వేలెత్తి చూపే బదులు.. అమెరికా దిగ్బంధం విధించినప్పుడే ఆ మార్గంలో ఉన్న నౌకల్లో పని చేసే భారతీయులకు కేంద్ర మంత్రిత్వ శాఖ కఠినమైన ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం ఉంది. అదే జరిగితే.. మూడు విలువైన ప్రాణాలు పోకుండా ఉండేవని చెప్పక తప్పదు.

## ఊపిరి పీల్చుకో ప్రపంచమా..!! ఇరాన్‌తో మహా ఒప్పందంపై ట్రంప్ కీలక ప్రకటన

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో యుద్ధానికి సంబంధించి తాము ఒక గొప్ప, చారిత్రాత్మక సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు ఆయన అధికారికంగా వెల్లడించారు. ఈ డీల్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను ఫైనలైజ్ చేసే ప్రక్రియ ప్రస్తుతం శరవేగంగా సాగుతోందని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రకటనతో ప్రపంచ దేశాలలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని అంటున్నారు.

**ఈ వీకెండ్‌లోనే సంతకాలు!**

వైట్ హౌస్ వేదికగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. 'ఇరాన్‌తో డీల్ దాదాపు ఖరారైంది. రానున్న కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియ మొత్తం పూర్తికావచ్చు. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ వారాంతంలోనే యూరప్‌లో ఇరు దేశాల మధ్య సంతకాల కార్యక్రమం జరగొచ్చు' అని స్పష్టం చేశారు. ఈ ఒప్పందంతో గల్ఫ్ రీజియన్‌లో శాంతి నెలకొంటుందని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు.

**ఆ ఒక్క కండిషన్‌కు ఇరాన్ గ్రీన్ సిగ్నల్**

ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశాన్ని ట్రంప్ మీడియాకు వివరించారు. 'ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వాయుధం ఉండకూడదు' అనే ప్రధాన నిబంధనపైనే ఈ డీల్ కుదిరినట్లు ఆయన స్పష్టం చేశారు. అమెరికా పెట్టిన ఈ గట్టి కండిషన్‌కు ఇరాన్ అంగీకరించడం అంతర్జాతీయ దౌత్య చరిత్రలోనే ఒక పెద్ద మైలురాయిగా నిలిచిపోనుంది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊరట!**

అంతర్జాతీయంగా ముడిచమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి'పై ఈ ఒప్పందం సానుకూల ప్రభావం చూపనుందని అంటున్నారు. ఇరాన్‌తో ఒప్పందంపై సంతకాలు పూర్తి కాగానే హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో ఓపెన్ అవుతుందని ట్రంప్ ప్రకటించారు. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు అంటే 20 శాతం చమురు రవాణా హార్ముజ్ జలసంధి ద్వారానే జరుగుతోంది. ఉద్రిక్తతల కారణంగా ఇక్కడ రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. తాజా డీల్‌తో చమురు సంక్షోభానికి బ్రేక్ పడటమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లు కోలుకునే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం గత కొంతకాలంగా తెరవెనుక నడిచిన సుదీర్ఘ దౌత్య చర్చల ఫలితంగానే ఈ ఒప్పందం సాధ్యమైందని అంటున్నారు. యూరప్ దేశాలు ఈ డీల్‌లో కీలక మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు ప్రచారం జరుగుతోంది. అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షల వల్ల తీవ్ర సంక్షోభంలో ఉన్న ఇరాన్.. తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకే అణ్వాయుధాల తయారీని పక్కనబెట్టి అమెరికాతో చేతులు కలపడానికి మొగ్గు చూపినట్లు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ట్రంప్ చేసిన ఈ ప్రకటనతో అటు మిడిల్ ఈస్ట్‌తోపాటు ఇటు ప్రపంచ దేశాలకు పెద్ద ఊరట లభించినట్లయింది.

## గ్రౌండ్‌లో ప్రతి నిమిషం కోట్ల వర్షం...రొనాల్డో రికార్డ్ సంపాదన!

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో పేరు వింటేనే రికార్డులు మోత మోగుతాయి. కేవలం ఆటలోనే కాదు, సంపాదనలోనూ ఆయనకు తిరుగులేదని మరోసారి నిరూపితమైంది. ఫోర్బ్స్ జాబితా ప్రకారం ప్రపంచంలోనే అత్యధికంగా ఆర్జించే క్రీడాకారుడిగా రొనాల్డో రికార్డ్ సృష్టించాడు. ఆయన మైదానంలో అడుగుపెట్టి ఆడే ప్రతి నిమిషానికి కురిసే కోట్ల వర్షం చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. రొనాల్డో సంపాదనకు సంబంధించిన ఆసక్తికరమైన లెక్కలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఆ విశేషాలు చూద్దాం..



**నిమిషానికి 33 లక్షలు.. నమ్మశక్యం కాని నిజం:**

క్రిస్టియానో రొనాల్డో మైదానంలో ఉన్న ప్రతి నిమిషానికీ సగటున అక్షరాలా రూ. 33.33 లక్షలు సంపాదిస్తున్నాడు. అంటే మనం ఒక చిన్న కాఫీ తాగి ముగించే లోపే ఆయన ఖాతాలో లక్షల రూపాయలు జమైపోతాయన్నమాట. ఇక సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ క్లబ్ 'అల్ నస్ర్' తో చేసుకున్న భారీ ఒప్పందం వల్లే రొనాల్డోకు ఈ స్థాయి రేంజ్‌లో ఆదాయం లభిస్తోంది.

**ఏడాదికి వేల కోట్ల ఆదాయం:**

కేవలం క్లబ్ ఒప్పందం ద్వారానే రొనాల్డో ఏడాదికి దాదాపు రూ. 1,700 కోట్లు ఆర్జిస్తున్నాడు. ఇక ఇతర బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, యాడ్స్ అన్నీ కలుపుకుంటే గత 12 నెలల్లో ఆయన మొత్తం సంపాదన అక్షరాలా రూ. 2,356 కోట్లు. ఈ అద్భుతమైన సంపాదనతో ఫోర్బ్స్ అత్యధిక ఆదాయ గల క్రీడాకారుల జాబితాలో వరుసగా మూడో ఏడాది కూడా రొనాల్డో నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

**ఒక్క మ్యాచ్ ఆడితే రూ. 30 కోట్లు:**

రొనాల్డో సాధారణంగా తన దేశం తరఫున ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఎలాంటి డబ్బు తీసుకోడు. కేవలం క్లబ్స్ తరఫున మాత్రమే మ్యాచ్ ఫీజ్ తీసుకుంటాడు.ఇక ఓవరాల్‌గా ఏడాదికి ఆయన సుమారు 55 గేమ్స్ ఆడతారని అనుకుంటే.. ఒక్కో మ్యాచ్‌కు ఆయనకు రూ. 30 కోట్లకు పైనే అందుతోంది. ఈ లెక్కలు చూస్తుంటే రొనాల్డో బ్రాండ్ వాల్యూ ఏ రేంజ్‌కు చేరిందో అర్థం చేసుకోవచ్చు.

**మన ఇండియన్ ప్లేయర్స్‌తో పోల్చితే?:**

రొనాల్డో సంపాదనతో పోల్చి చూస్తే ఒక సాధారణ ఇండియన్ ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్ ఏడాది జీతం సగటున రూ. 12 లక్షలు మాత్రమే ఉంటుంది. అంటే ఒక భారతీయ ఆటగాడు ఏడాది మొత్తం కష్టపడి సంపాదించే డబ్బును, రొనాల్డో గ్రౌండ్‌లోకి దిగిన కేవలం అర నిమిషం లోపే సంపాదిస్తున్నాడన్నమాట. ఈ పోలిక వినడానికి కాస్త ఆశ్చర్యంగా ఉన్నా ఇది పచ్చి నిజం.

**చరిత్ర సృష్టించిన ఏకైక క్రీడాకారుడు:**

ఫుట్‌బాల్ చరిత్రలోనే కాకుండా మొత్తం క్రీడా ప్రపంచంలోనే తన కెరీర్ సంపాదనలో 2 బిలియన్ డాలర్ల దాదాపు రూ. 16,000 కోట్లకు పైగా మార్కును దాటిన మొట్టమొదటి యాక్టివ్ ప్లేయర్‌గా రొనాల్డో సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇక మైదానంలో కేవలం ఆటతోనే కాకుండా, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పర్సనల్ బ్రాండ్‌ను నిర్మించుకుని రొనాల్డో ఈ ఘనత సాధించాడు. క్రిస్టియానో రొనాల్డో కేవలం ఒక ఫుట్‌బాల్ ఆటగాడు మాత్రమే కాదు, ఒక గ్లోబల్ బ్రాండ్. వయసు పెరుగుతున్నా కొద్దీ ఆటలోనూ, సంపాదనలోనూ ఆయన రేంజ్ అస్సలు తగ్గడం లేదు. అసాధ్యం అనుకున్న రికార్డులను సైతం చాలా ఈజీగా బద్దలు కొడుతూ దూసుకుపోతున్న రొనాల్డో, రాబోయే రోజుల్లో ఇంకెన్ని వండర్స్ క్రియేట్ చేస్తాడో చూడాలి.

## నీతులు చెప్పే యూరప్‌కు వాస్తవాల 'డోస్'.. జైశంకర్ పంచ్‌లకు విదేశీ జర్నలిస్ట్ మైండ్ బ్లాక్!



ఇంటర్నేషనల్ వేదికలపై మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మైక్ పట్టుకున్నారంటే చాలు... అవతలి దేశాల ప్రతినిధులకు చెమటలు పట్టాల్సిందే. తాజాగా యూరోపియన్ల 'అతి తెలివి'కి ఆయన ఇచ్చిన 'సౌండ్' ట్రీట్‌మెంట్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ప్రపంచానికి ప్రజాస్వామ్యం, హక్కులు, నైతికత అంటూ రోజూ పొద్దున్నే లేచి ఫ్రీగా ట్యూషన్లు చెప్పే యూరోపియన్ దేశాలకు మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గట్టి 'డోస్' ఇచ్చారు. "నీతులు చెప్పడం ఈజీ బ్రదర్... పాటించడమే కష్టం" అనే రేంజ్‌లో ఆయన వేసిన కౌంటర్లకు సోషల్ మీడియాలో నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. "అట్లుంటది మరి జైశంకర్‌తో పెట్టుకుంటే!" అంటూ మీమ్స్‌తో హోరెత్తిస్తున్నారు.

**సీన్ కట్ చేస్తే... ఫిన్లాండ్‌లో ఏం జరిగిందంటే?**

ఫిన్లాండ్ పర్యటనలో ఉన్న జైశంకర్‌ను ఎలాగైనా ఇరుకున పెట్టాలని ఓ విదేశీ జర్నలిస్ట్ ప్లాన్ చేశాడు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ "రష్యా దగ్గర భారత్ ఎందుకు అంతలా చమురు కొంటోంది? మీరు మాస్కోకు పరోక్షంగా సపోర్ట్ చేస్తున్నట్టే కదా?" అంటూ ఒక పదునైన బాణం విసిరాడు. కట్ చేస్తే... ప్రశ్న పూర్తి కాకముందే జైశంకర్ తనదైన స్టైల్లో 'రివర్స్ అటాక్' మొదలుపెట్టారు.

**జైశంకర్ ఇచ్చిన 'ఉచిత' సలహా**

"నిజానికి మాకు సాంప్రదాయకంగా చమురు సరఫరా చేసేది మధ్యప్రాచ్య దేశాలు. కానీ ఉక్రెయిన్ సంక్షోభం రాగానే మీ యూరోపియన్ దేశాలన్నీ పరుగెత్తుకుంటూ వెళ్లి ఆ మిడిల్ ఈస్ట్ ఆయిల్‌నంతా మీరే కొనేశారు. మాకు ఆప్షన్స్ లేకుండా చేశారు. మరి మా దేశ ప్రజల ప్రయోజనాల కోసం మేము ప్రత్యామ్నాయంగా రష్యా వైపు చూడక ఏం చేస్తాం?" ఈ దెబ్బతో సదరు జర్నలిస్టుకు కాసేపు మైండ్ బ్లాక్ అయింది. సభలో ఒక్కసారిగా 'పిన్ డ్రాప్ సైలెన్స్'

**ఇంకొక్క బుల్లెట్...**

అక్కడితో ఆగితే ఆయన జైశంకర్ ఎందుకవుతారు? యూరప్ చరిత్రను తిరగేస్తూ మరో స్ట్రాంగ్ పంచ్ ఇచ్చారు. "భారతదేశ ఆయుధాలతో యూరప్‌పై ఎప్పుడూ ఏ దాడి జరగలేదు. కానీ మీ యూరోపియన్ ఆయుధాలతో భారత భూభాగంపై ఎన్నో దాడులు జరిగాయి.. మా వాళ్ల ప్రాణాలు కోల్పోయారు. అది మర్చిపోవద్దు!"ఈ దెబ్బకు ప్రశ్న అడిగిన జర్నలిస్ట్, స్క్రిప్ట్ మార్చేసి... తర్వాతి ప్రశ్నకు జంప్ అయిపోయాడని సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.

**నెటిజన్ల 'సెటైర్ల' పండగ!**

ఈ సీన్ చూసిన భారతీయ నెటిజన్లు ఊరుకుంటారా? సోషల్ మీడియాలో ట్రోల్స్, మీమ్స్‌తో యూరప్ దేశాలను ఆడుకుంటున్నారు. "నీతులు ఎగుమతి చేసే యూరప్‌కు... వాస్తవాలు దిగుమతి చేసిన జైశంకర్!" "ప్రశ్న అడిగినప్పుడు వాడు జర్నలిస్ట్... సమాధానం విన్నాక జైశంకర్ క్లాస్‌లో 'ఫస్ట్ బెంచ్' స్టూడెంట్.. ఒకప్పుడు మనవాళ్లు డిప్లొమాటిక్‌గా ఖండించేవారు... ఇప్పుడు డైరెక్ట్‌గా గుండెల్లో దింపేస్తున్నారు!" అంటూ సెటైర్లు వేస్తున్నారు. అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత స్నేహితులు, శాశ్వత శత్రువులు ఉండరు... కేవలం 'శాశ్వత ప్రయోజనాలు' మాత్రమే ఉంటాయి. ఆ ప్రయోజనాలను కాపాడుకోవడంలో దేశ ప్రయోజనాల కోసం ప్రపంచ వేదికలపై తలవంచకుండా మాట్లాడడంలో భారత్ ఇప్పుడు రూట్ మార్చిందని జైశంకర్ మరోసారి నిరూపించారు. సో... ఇకనైనా మనకు క్లాసులు పీకే ముందు యూరప్ దేశాలు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుంటే మంచిది.

## మస్క్ మామ మామూలుడో కాదు.. కుంభస్థలాన్ని కొట్టేశాడు

మస్క్ మామ మామూలుడో కాదు.. కుంభస్థలాన్ని కొట్టేశాడు ప్రపంచ ఆర్థిక, సాంకేతిక ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తూ ఎలాన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ 'స్పేస్ఎక్స్' సరికొత్త రికార్డులను తిరగరాసింది.



ప్రపంచ ఆర్థిక, సాంకేతిక ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తూ ఎలాన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ 'స్పేస్ఎక్స్' సరికొత్త రికార్డులను తిరగరాసింది. గ్లోబల్ మార్కెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అతిపెద్ద ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా స్పేస్ఎక్స్ ఏకంగా 75 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించి.. అంతర్జాతీయ ఆర్థిక వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఈ అసాధారణమైన ఐపీవో దెబ్బకు ప్రపంచ మార్కెట్లో స్పేస్ఎక్స్ మొత్తం వాల్యుయేషన్ (మార్కెట్ విలువ) దాదాపు 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు తెలుస్తోంది. టెక్నాలజీ, స్పేస్ సెక్టార్లలో ఇదొక అద్భుతమైన మైలురాయిగా నిలిచిపోనుంది.

**సౌదీ అరామ్‌కో రికార్డు బద్దలు!**

మార్కెట్ విశ్లేషకుల సమాచారం ప్రకారం.. స్పేస్ఎక్స్ ఒక్కో షేరును సుమారు 135 డాలర్ల ధరకు విక్రయించింది. ఈ ప్రక్రియలో భాగంగా ఏకంగా 5,556 కోట్ల షేర్లను మార్కెట్లోకి విడుదల చేసి ఈ రికార్డు స్థాయి నిధులను రాబట్టింది. 2019వ సంవత్సరంలో ప్రపంచ చమురు దిగ్గజం 'సౌదీ అరామ్‌కో' 29.5 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణతో ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీవోగా సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పుడా రికార్డును స్పేస్ఎక్స్ దాదాపు మూడు రెట్ల మార్జిన్‌తో బద్దలు కొట్టడం గమనార్హం.

**ట్రిలియనీర్ రేసులో ఎలాన్ మస్క్**

స్పేస్ఎక్స్ సాధించిన ఈ అద్భుత విజయంతో కంపెనీ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎలాన్ మస్క్ సంపద ఊహించని స్థాయికి దూసుకెళ్లింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా అంచనాల ప్రకారం మస్క్ నికర సంపద ఇప్పుడు 970 బిలియన్ డాలర్లకు చేరువైనట్లు తెలుస్తోంది. ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ హోదాను అందుకోవడానికి మస్క్ కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉన్నారు. ఈ తాజా విజయంతో ప్రపంచ ధనవంతుల జాబితాలో ఆయన తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నారు.

**భవిష్యత్ సాంకేతికతకు స్పేస్ఎక్స్ కేరాఫ్ అడ్రస్**

కేవలం రాకెట్ ప్రయోగాలకే పరిమితం కాకుండా స్పేస్ఎక్స్ తన పరిధిని విస్తరించుకుంటూ పోతోంది. స్టార్‌లింక్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించడం, భవిష్యత్ మార్స్ మిషన్లు, పునర్వినియోగ రాకెట్ సాంకేతికత లో స్పేస్ఎక్స్ ఇప్పటికే రారాజుగా నిలిచింది. కృత్రిమ మేధస్సు (ఏఐ), అంతరిక్ష సాంకేతికత, గ్లోబల్ కమ్యూనికేషన్ రంగాల భవిష్యత్తును శాసించే శక్తిగా స్పేస్ఎక్స్ ఎదుగుతుందని పెట్టుబడిదారులు గట్టిగా నమ్ముతున్నారు.

**ఇది హైప్ ఆ? రియాలిటీనా?**

స్పేస్ఎక్స్ ఐపీవో ప్రపంచవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తెచ్చినప్పటికీ మార్కెట్ నిపుణులలో కొందరు మాత్రం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. కంపెనీపై ఉన్న విపరీతమైన అంచనాలు ఇన్వెస్టర్ల ఉత్సాహం.. వాస్తవ వ్యాపార ఫలితాలు, లాభాల కంటే ఎక్కువగా ఉంటే భవిష్యత్తులో మార్కెట్ ఒడిదుడుకులకు లోనయ్యే ప్రమాదం ఉంది. టెక్నాలజీ రంగంలో గతంలో కూడా ఇలాంటి విపరీతమైన 'హైప్' కారణంగా డాట్-కామ్ బబుల్ వంటి సమయాల్లో అనేక కంపెనీల షేర్లు కుప్పకూలిన ఉదాహరణలను నిపుణులు గుర్తుచేస్తున్నారు.

స్పేస్ఎక్స్ ఐపీఓ ప్రపంచ పెట్టుబడి మార్కెట్లలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందనేది అక్షర సత్యం. ఇది భవిష్యత్ సాంకేతిక విప్లవానికి బలమైన పునాదా? లేక పెట్టుబడిదారుల అతి ఉత్సాహమా? అనే ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పాలి. ఏదేమైనా అంతరిక్షాన్ని వ్యాపార వేదికగా మార్చడంలో ఎలాన్ మస్క్ వేసిన ఈ అడుగు మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది.

# స్టాక్ మార్కెట్ పండగ చేసుకుంది : రూ.7 లక్షల కోట్ల లాభాలకి కారణాలు ఇవే.. !

ఇండియన్ స్టాక్ మార్కెట్ పండగ చేసుకుంది. చాలా రోజుల తర్వాత భారీ లాభాలతో ముగిసింది. వీకెండ్ శుక్రవారం రోజంతా మార్కెట్ అంతకంతకూ పెరుగుతూ ఇన్వెస్టర్లను హ్యాపీ చేసింది. ఓవరాల్ 2 శాతం పెరుగుదలతో 7 లక్షల కోట్ల సంపద క్రియేట్ అయ్యింది. సెన్సెక్స్ 16 వందల 95 పాయింట్లు, నిఫ్టీ 461 పాయింట్లు లాభాల్లో ముగిసింది. 2026, జూన్ 12వ తేదీ మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 75 వేల 527 పాయింట్ల దగ్గర ముగిసింది. నిఫ్టీ 23 వేల 622 దగ్గర క్లోజ్ అయ్యింది. అన్ని స్టాక్స్ లోనూ కొనుగోళ్లు జరిగాయి. సెన్సెక్స్ లో 30 స్టాక్స్ లాభాల్లో ట్రేడ్ అవ్వగా.. టాటా స్టీల్, ఇండిగో, ఎల్ అండ్ టీ, ఎటర్నల్, ఎస్ బీఐ, టెక్ మహీంద్రా షేర్లు 3 శాతం వరకు పెరిగాయి. స్మాల్ క్యాప్ షేర్లు 2 శాతం వరకు లాభపడ్డాయి. స్టాక్ మార్కెట్ భారీ లాభాలు కారణాలు ఏంటీ అనేది చూస్తే..



ఇరాన్ దేశంపై దాడులు తీవ్రం చేస్తామని చెప్పిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనక్కి తగ్గారు. ఇరాన్ దేశంతో శాంతి చర్చలకే ప్రాధాన్యం ఇస్తూ.. డీల్ ముగుస్తుందని ప్రకటించారు ట్రంప్. యుద్ధం దాదాపు ముగిసినట్లే అని.. దౌత్యమార్గంలోనే యుద్ధానికి ముగింపు ఉంటుందని అమెరికా ప్రకటించటంతో.. పెట్టుబడి దారుల్లో ఉత్సాహం కనిపించింది.

**తగ్గిన క్రూడ్ ఆయిల్ ధరలు :**

అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గాయి. బ్యారల్ ధర 90 డాలర్లకు పడిపోయింది. ఇరాన్ యుద్ధం కొలిక్కి వస్తుందనే ఆశాభావంతో బ్రెంట్, డబ్ల్యూటీఐ క్రూడ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా 4 శాతం పడిపోయింది.

**ఇండియన్ రూపాయి బలపడింది :**


అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గటంతోపాటు భారతీయ రూపాయి విలువ బలపడింది. డాలర్ తో రూపాయి మారకం విలువ 60 పైసలు బలపడి.. 95 రూపాయల 25 పైసలకు చేరింది. యుద్ధం ఉద్రిక్తతలు తగ్గటం, ముడి చమురు ధరలు దిగిరావటం, రూపాయి విలువ బలపడటం వంటి కారణాలతో మన స్టాక్ మార్కెట్ పండగ చేసుకుంది. ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టారు. వీటికితోడు అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు సైతం లాభాల్లో ట్రేడ్ కావటంతో.. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బాగా కలిసి వచ్చింది.

## జూలైలో భారీగా పెరగనున్న టాటా కార్ల ధరలు : ఈ ఏడాదిలో ఇది రెండోసారి




టాటా మోటార్స్ షాక్ ఇచ్చింది. 2026, జూలై ఒకటో తేదీ నుంచి కార్ల ధరలు పెంచనున్నట్లు ప్రకటించింది కంపెనీ. జూలై ఒకటో తేదీ నుంచి అన్ని కార్లపై ధరలు పెరగబోతున్నట్లు స్పష్టం చేసింది. కమర్షియల్, ప్యాసింజర్ వెహికల్స్ అన్ని మోడళ్ల కార్లపై ధరల పెంపు ఉంటుందని వెల్లడించింది టాటా మోటార్స్. పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాలపై ఒకటిన్నర శాతం ధర పెరగనుందని.. అంటే 10 లక్షల రూపాయల కారుపై 15 వేల రూపాయలు పెరగనున్నట్లు వివరించింది కంపెనీ. ఎలక్ట్రికల్ వాహనాలపైనా ఈ ధరల పెంపు ఉంటుందని స్పష్టం చేసింది కంపెనీ. ముడి సరుకుల ధరలు భారీగా పెరగటం.. ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో రవాణా ఛార్జీలు భారీగా పెరగటం కారణంగానే వాహనాల ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించింది కంపెనీ. పెరుగుతున్న ధరలతో పోల్చితే పెంచుతున్న ధరలు కొద్దిగానే ఉన్నాయని.. చాలా వరకు సర్దుబాటు చేస్తున్నట్లు వెల్లడించింది కంపెనీ. టాటా మోటార్స్ కార్ల ధరలు పెంచటం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. 2026, ఏప్రిల్ ఒకటో తేదీన అన్ని వాహనాలపై పాయింట్ 5 శాతం ధరలు పెంచింది. జూలై ఒకటో తేదీన ఒకటిన్నర శాతం పెంచుతుంది. అంటే ఆరు నెలల్లో 2 శాతం ధరలు పెరిగాయి. ఇండియాలో కమర్షియల్, ప్యాసింజర్ వెహికల్స్ అమ్మకాల్లో టాటా మోటార్స్ రెండో స్థానంలో ఉంది. జూన్ ఒకటో తేదీన మారుతీ సుజికీ కార్లపై 30 వేల రూపాయలు పెంచింది. దీనికి కొనసాగింపుగా అన్నట్లు.. టాటా మోటార్స్ జూలై ఒకటి నుంచి ఒకటిన్నర శాతం ధరలను పెంచుతుంది. టాటా మోటార్స్ లో వెహికల్ కొనాలనే ప్లాన్ ఉన్నోళ్లు.. ఈ 20 రోజుల్లోనే కొనేయండి.. లేకపోతే జూలై ఒకటి నుంచి కనీసంలో కనీసం 15 నుంచి 20 వేల రూపాయల వరకు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

# భూ మండలంపై ధనవంతుడిగా ఎలన్ మస్క్ : చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్ IPO




ఎలన్ మస్క్.. భూ మండలంపైనే ఫస్ట్ ట్రిలియనీర్ గా అవతరించాడు. లక్ష కోట్ల రూపాయల వ్యక్తిగత ఆస్తులతో సరికొత్త చరిత్ర సృష్టించాడు ఎలన్ మస్క్. ఇప్పుడు భూ మండలంపైనే ధనవంతుడు ఎలన్ మస్క్ అయ్యాడు. 2026, జూన్ 12వ తేదీన ఎలన్ మస్క్ కు చెందిన స్పేస్ ఎక్స్ కంపెనీ స్టాక్ మార్కెట్ లో లిస్ట్ అయ్యింది. ఈ ఐపీవో సైతం అంచనాలను మించి సక్సెస్ అయ్యింది.

ప్రపంచంలోనే అతి పెద్ద ఐపీవో ద్వారా స్పేస్ ఎక్స్ 75 బిలియన్ డాలర్లు సమీకరించింది.

స్పేస్ ఎక్స్ ఒక్కో షేరును 135 డాలర్లుగా ధర నిర్ణయించింది. మొత్తం 555.6 మిలియన్ షేర్లను మార్కెట్ లోకి విడుదల చేసింది. దీని ద్వారా 75 బిలియన్ డాలర్లను సమీకరించింది స్పేస్ ఎక్స్ కంపెనీ.

స్పేస్ ఎక్స్ షేర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. నాలుగు రెట్లు డిమాండ్ ఎక్కువ వచ్చింది.

ఐపీవో తర్వాత స్పేస్ ఎక్స్ కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 1.77 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఉద్యోగులకు ఇచ్చిన స్ట?క్స్, ఇతర వాటా యూనిట్లను పరిగణలోకి తీసుకుంటే దాని విలువ 1.80 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని మార్కెట్ వర్గాలు స్పష్టం చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్ చరిత్రలోనే స్పేస్ ఎక్స్ ఐపీవో రికార్డ్ సృష్టించింది. ప్రపంచంలోనే టాప్ 10 పబ్లిక్ కంపెనీల సరసన నిలిచింది.

రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్ బ్రాడ్ బ్రాండ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అంతరిక్ష పరిశోధనలతో స్పేస్ ఎక్స్ దూసుకెళ్తుంది. ఎలన్ మస్క్ ఆలోచనలకు పెట్టుబడిదారులు మరింత విశ్వాసంగా ఉండటం కలిసొచ్చింది. స్పేస్ ఎక్స్ ఐపీవోకు వచ్చిన స్పందన చూసిన తర్వాత.. రాబోయే ఏపెన్ ూ×, ఆంథ్రోపిక్ ఐపీవోలపై భారీ అంచనాలు పెరిగాయి. ఆ రెండు కంపెనీలు సైతం ట్రిలియన్ డాలర్ల విలువను చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

## 2026 ఆర్థిక సంవత్సరంలో 13,223 జాబ్స్ ఇచ్చిన బ్యాంకులు




న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎనిమిది బ్యాంకులు 2026 ఆర్థిక సంవత్సరంలో 13,223 మందిని నియమించుకున్నాయి. దీంతో వీటి మొత్తం సిబ్బంది సంఖ్య 6.28 లక్షలు దాటింది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్?బీఐ 8,905 ఉద్యోగాలు ఇవ్వడం ద్వారా మొదటి స్థానంలో నిలిచింది.

2025 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు ఉద్యోగుల సంఖ్య 6.15 లక్షలుగా ఉండేది. ఈ జాబితాలో ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), ఇండియన్ బ్యాంక్, యూసీఓ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉన్నాయి.

### వీసా కార్డ్ హోల్డర్లకు డిస్కౌంట్లు




తన ప్లాటినం, క్లాసిక్ క్రెడిట్, డెబిట్ కార్డ్ హోల్డర్లకు అదనపు ప్రయోజనాలను అందిస్తున్నట్లు వీసా ప్రకటించింది. రోజువారీ ఖర్చులపై డిస్కౌంట్లు వంటి ప్రయోజనాలు ఇస్తామని తెలిపింది. దీనివల్ల దాదాపు 29 కోట్ల కార్డుదారులకు ప్రయోజనం ఉంటుంది. స్విగ్గీ, జెప్టో, మీషో, ఇన్‌స్టామార్ట్, అభీబస్ వంటి బ్రాండ్లతో వీసా ఒప్పందం కుదుర్చుకుంది. సోనీలివ్, జీ5 వంటి ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు, లైఫ్‌స్టైల్, షాపర్స్ స్టాప్, మ్యాక్స్, లులు, మోర్, స్టార్ బజార్ రిటైల్ భాగస్వాములని వీసా తెలిపింది.

# బంగారం, వెండి ధరలు మళ్లీ భారీగా పెరిగాయి




బంగారం, వెండి ధరలు పెరిగాయి. గత 10 రోజులుగా తగ్గుతూ వస్తున్న ధరలు.. 2026, జూన్ 12వ తేదీన పెరగటం మొదలుపెట్టింది. ఇరాన్ పై అమెరికా యుద్ధానికి సంబంధించి క్లారిటీ రావటం.. చర్చలకు ఇరాన్ దేశం ఓకే చెప్పటంతో మార్కెట్లు పాజిటివ్ గా ఉన్నాయి. యుద్ధం ముగిసింది అనే ఆలోచనలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపించటంతో బంగారం, వెండి ధరలు పెరిగాయి.

24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 300 రూపాయలు పెరిగింది. దీంతో తులం బంగారం లక్షా 48 వేల 580 రూపాయలుగా ఉంది. అదే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 270 రూపాయలు పెరిగింది. దీంతో తులం బంగారం లక్షా 36 వేల 200 రూపాయలుగా ఉంది. అదే 18 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 221 రూపాయలు పెరిగింది. దీంతో తులం బంగారం లక్షా 11 వేల 440 రూపాయలుగా ఉంది.

**వెండి ధరల విషయానికి వస్తే..**

ధరలు భగ్గుమన్నాయి. కేజీ వెండి ఒక్క రోజునే 5 వేల రూపాయలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్ లో కేజీ వెండి 2 లక్షల 65 వేల రూపాయలకు చేరింది. ఇక ప్లాటినమ్ విషయానికి వస్తే బంగారం, వెండి బాటలోభారీగా పెరిగింది ప్లాటినం ధర. 10 గ్రాములకు 2 వేల 100 రూపాయిలు పెరిగింది. దీంతో 12వ తేదీన 10 గ్రాముల ప్లాటినం ధర 53 వేల 160 రూపాయలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లు పాజిటివ్ గా ఉండటంతో.. బంగారం, వెండి, ప్లాటినమ్ ధరలు భారీగా పెరిగాయి. ఇదే విధంగా కొనసాగుతాయా లేక మళ్లీ ధరలు పడతాయా అనేది వేచి చూడాలి.

## యుద్ధం కొనసాగితే.. ఆయిల్ ధర 150 డాలర్లకు




న్యూఢిల్లీ: అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారితే ముడిచమురు ధరలు బ్యారెల్‌కు ఏకంగా 150 డాలర్లకు చేరొచ్చని ఆయిల్ మార్కెట్ ఎనాలసిస్ కంపెనీ రిస్టాడ్ ఎనర్జీ హెచ్చరించింది. ఆరు గల్ఫ్ దేశాలకు చెందిన రోజుకు 1.18 కోట్ల బ్యారెల్స్ చమురు సరఫరా నిలిచిపోవడంతో ఆయిల్ సంక్షోభం నెలకొందని తెలిపింది. ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల బ్రెంట్ ధర ఒక్కసారిగా బ్యారెల్ 94.5 డాలర్లకు పెరిగింది. అమెరికా తన వ్యూహాత్మక నిల్వల నుంచి రికార్డు స్థాయిలో చమురును విడుదల చేయడం, చైనా దిగుమతులు తగ్గడం, రోజుకు 50 లక్షల బ్యారెళ్ల చమురు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా సౌదీ అరేబియా యాన్బు రేవు ద్వారా తరలుతుండటం వల్ల ధరలు విపరీతంగా పెరగలేదు.


# ఎన్ఆర్ఐ డిపాజిట్లపై 7.10 శాతం వరకు వడ్డీ.. డాలర్లను ఆకర్షించేందుకు డిపాజిట్ రేట్లను పెంచిన బ్యాంకులు

ముంబై: ఎన్ఆర్ఐల నుంచి డిపాజిట్లను ఆకర్షించడానికి పలు బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేటును ఏకంగా 350 బేసిస్ పాయింట్ల (3.50 శాతం) వరకు పెంచాయి. 3 నుంచి 5 ఏళ్ల ఎన్ఆర్ఐ డిపాజిట్లపై అయ్యే పూర్తి హెడ్జింగ్ ఖర్చును తామే భరిస్తామని ఆర్‌బీఐ ప్రకటించడంతో బ్యాంకులు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

కాగా, బ్యాంకులు ఫారిన్ కరెన్సీ డిపాజిట్లు స్వీకరించినప్పుడు హెచ్చుతగ్గుల వల్ల నష్టపోకుండా ఉండడానికి ఈ కరెన్సీలకు వ్యతిరేకంగా హెడ్జింగ్ చేస్తాయి. ఈ ఖర్చును బ్యాంకులే భరించాల్సి ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఖర్చులను తామే భరిస్తామని ఆర్‌బీఐ ప్రకటించింది. రూపాయి పతనాన్ని ఆపడానికి, డాలర్లను ఆకర్షించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: 3 నుంచి 5 ఏళ్ల డిపాజిట్లపై వడ్డీ రేటును 3 శాతం పెంచి 6 శాతానికి చేర్చింది. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్: 3 ఏళ్ల డిపాజిట్లపై 7.1శాతం, 5 ఏళ్లపై 7శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. యెస్ బ్యాంక్: కాలపరిమితిని బట్టి 7శాతం నుంచి 7.10శాతం వరకు వడ్డీ రేట్లను నిర్ణయించింది. ఈ చర్యలతో ఇండియన్ బ్యాంకులు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి సుమారు 35--40 బిలియన్ డాలర్ల విదేశీ నిధులను సేకరించొచ్చని అంచనా. ఆర్?బీఐ మాత్రం వడ్డీరేట్లను మార్చలేదు.



# గం‘జాయ్ ఊబి’



ఆనందంలో ఓలలాడుతామనే అపోహో, ఉత్సుకతో.. సామర్థ్యం పుంజుకుంటుందన్న అత్యాశో, తోటివారి ప్రోద్భలమో.. కారణమేదైనా మనదగ్గర గంజాయి వాడకం ఎక్కువైందన్న మాట వాస్తవం. ముఖ్యంగా యువత దీనికి బాగా లొంగిపోతున్నారు. కాలేజీ విద్యార్థుల్లో 6 నుంచి 30 శాతం మంది దీని రుచికి మరిగినవారేనని అధ్యయనాలు చెబుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ భవిత మత్తులో మునిగిపోయినట్టే.

కౌమార, యవ్వన దశలో మెదడులో చాలా మార్పులు జరుగుతుంటాయి. ఇది 25 ఏళ్ల వరకూ వృద్ధి చెందుతూనే వస్తుంది మరి. యువతీ యువకులుగా మారుతున్న క్రమంలో విద్య, ఉద్యోగ, సమాజ పరంగా సవాళ్లను ఎదుర్కోవాల్సిన తరుణంలో తప్పటడుగు వేస్తే జీవితం గాడి తప్పుతుంది. ఇలాంటి సమయంలో మెదడును లోబరచుకునే గంజాయి వలలో చిక్కితే ఇంకేమైనా ఉందా? చిన్న వయసులో దీని ప్రభావం మరింత ఎక్కువగా పడుతుంది. కొద్దిగా వాడినా దీర్ఘకాలం దుష్ప్రభావాలు వెంటాడుతూ వస్తాయి. అయితే మనదగ్గర సగటున 18.4 ఏళ్లలోనే గంజాయికి అలవడుతుండటం దురదృష్టకరం.

## సమస్యల వల

గంజాయి మూలంగా మెదడులో భావోద్వేగాలను అదుపులో ఉంచే అమిగ్దల.. పనులను చేయటానికి, నిర్ణయాలు తీసుకోవటానికి తోడ్పడే ప్రిఫ్రాంటల్ కార్టెక్స్ భాగాల ఎదుగుదల బాగా కుంటుపడుతుంది. ఇది రకరకాల సమస్యలకు దారితీస్తుంది.

**ఏకాగ్రత దెబ్బతినటం:** గంజాయి మత్తులో ఉన్నప్పుడు ఆలోచనలు కోటలు దాటుతుంటాయి. ఏవేవో గొప్ప గొప్ప కార్యాలు చేస్తామని కోతలు కోస్తుంటారు. కానీ వాస్తవం వేరు. ఏకాగ్రత కొరవడటం వల్ల చదువులు దెబ్బతింటూ వస్తుంటాయి. మిగతావారి కన్నా తక్కువ మార్కులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. లక్ష్యం కోసం పోరాడే, పాటుపడే గుణం కోల్పోవచ్చు. ఫలితంగా ఉద్యోగ, వ్యాపారాల్లో రాణించలేక దిగువ స్థాయిలోనే ఉండిపోతారు.

**అనుచిత సాహసాలు, ప్రమాదాలు:** మెదడులో కార్యనిర్వాహక, కదలికలను నియంత్రించే వ్యవస్థలు ప్రభావితం కావటం వల్ల నిర్ణయాలు తీసుకునే శక్తి సన్నగిల్లుతుంది. దీంతో అనుచిత పనులకు, సాహసాలకు ఒడిగడుతుంటారు. ప్రమాదాల బారినపడుతుంటారు. గంజాయి వాడేవారికి రోడ్డు ప్రమాదాల ముప్పు 8–9 రెట్లు ఎక్కువ. అనుచిత లైంగిక కార్యకలాపాలకూ పాల్పొడొచ్చు. ఫలితంగా ఇన్‌ఫెక్షన్లు, అవాంఛిత గర్భాలు రావొచ్చు.

**మానసిక సమస్యలు:** గంజాయి వ్యసనం ఆందోళన, కుంగుబాటు, ఆత్మహత్య ఆలోచనలనూ ప్రేరేపిస్తుంది. మానసిక బలహీనతకూ దారితీస్తుంది.

**తీవ్ర జబ్బులు:** గంజాయిని పొగ రూపంలో తీసుకుంటే సిగరెట్ల మాదిరిగానే గుండెజబ్బు, పక్షవాతం, క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. ఆకు, పువ్వు భాగాల్లో ఉండే ఫంగస్, రసాయనాలు గాలి గదుల లోపలి పైపొర మీద నేరుగా ప్రభావం చూపుతాయి. ఇది బ్రాంకైటిస్, ఆస్థమా వంటి జబ్బులకూ దారితీస్తుంది. గంజాయితో ఊపిరితిత్తి క్యాన్సర్ ముప్పు 1.5 రెట్లు ఎక్కువగా ఉంటుండటం గమనార్హం.

**ఇతర దురలవాట్లు:** గంజాయి మూలంగా ఇతర మాదకద్రవ్యాల అలవాటూ కావొచ్చు. ఇది మరింత ప్రమాదకరం.

## నమిలి తీసుకుంటే మరింత ప్రమాదం

ఇప్పుడు చాక్లెట్లు, బ్రౌనీస్, కేక్స్, పకోడీల రూపంలోనూ గంజాయిని తీసుకుంటున్నారు. ఇదింకా ప్రమాదకరం. నమిలి తిన్నట్టయితే ఒంట్లో ఎక్కువసేపు ఉంటుంది. అతిగానూ తీసుకునే ప్రమాదముంది. పొగ రూపంలోని గంజాయి నిమిషాల్లోనే మెదడు మీద ప్రభావం చూపుతుంది. అదే చాక్లెట్ల రూపం లోనైతే అరగంట నుంచి గంట వరకూ పట్టొచ్చు. దీంతో ప్రభావమేమీ చూపటం లేదని ఎక్కువెక్కువగా తీసుకుంటారు.

## బయట పడేయొచ్చు

గంజాయి వ్యసనం నుంచి బయటపడేసే మార్గం లేకపోలేదు. అనుమానం వచ్చిన వెంటనే మానసిక నిపుణులను సంప్రదించాలి. ఇది చాలా ముఖ్యం. ఆయా లక్షణాలను బట్టి వ్యసనానికి లోనయ్యారో, లేదో గుర్తిస్తారు. ఏ వయసులో ఆరంభించారు? ఎంత మొత్తం తీసుకుంటున్నారు? ప్రవర్తనలో వచ్చిన మార్పులేంటి? దుష్ప్రభావాలు, మానసిక సమస్యలు ఎప్పుడు మొదలయ్యాయి? అనేవి నిశితంగా విశ్లేషిస్తారు. ప్రస్తుత మానసిక స్థితిని బట్టి మెదడు ఎంతవరకు ప్రభావితమైందో అంచనా వేస్తారు. వీటన్నింటి ఆధారంగా చికిత్సను నిర్ణయిస్తారు.

ముందుగా అవగాహన కలిగించేలా, మూడ్ మెరుగుపడేలా కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రతికూల భావనల నుంచి మనసును మళ్లించి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవటానికి తోడ్పడే పద్ధతులను, వ్యూహాలను నేర్పిస్తారు.

ఏడీహెచ్‌డీ, సాహసాలకు ఒడిగట్టే స్వభావం వంటి ఇతరత్రా ప్రవర్తన సమస్యలేవైనా ఉన్నట్టయితే వాటికీ చికిత్స చేస్తారు.

గంజాయిని మానేసినప్పుడు మొదట్లో కొన్ని వారాల పాటు విత్‌డ్రాయల్ లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇవి రెండు వారాల వరకూ తీవ్రంగా ఉంటాయి. అందువల్ల వీటిని తగ్గించటానికి సంతోషాన్ని కలిగించే మందులు అవసరమవుతాయి. తాము చేసే పనులతోనే ఆనందాన్ని పొందే గుణం అలవడే వరకూ వీటిని వేసుకోవాల్సి ఉంటుంది.

కౌన్సెలింగ్, మందులతోనే చాలావరకూ బాగుపడే అవకాశముంది. అయితే దీన్ని ఏదో ఒకరోజు సమస్యగా భావించరాదు. దీర్ఘకాలిక జబ్బు మాదిరిగా ఎక్కువకాలం చికిత్స అవసరమని గుర్తించాలి. సమస్య మరీ తీవ్రంగా ఉన్నవారిని కొద్దికాలం ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాల్సి వస్తుంది.

## లోబరచుకుంటుంది జాగ్రత్త

పొగ, మద్యం మాదిరిగానే గంజాయి కూడా వ్యవసనానికి దారితీస్తుంది. దీనికి కారణం మెదడును ఉత్తేజితం చేసే డెల్టా–9–టెట్రాహైడ్రోకెన్నబినాల్ రసాయనం. ఇది డొపమిన్ వంటి రసాయనాల విడుదలను ప్రేరేపించి, కృత్రిమ ఆనందాన్ని కలిగిస్తుంది. దాని కోసం తహతహలాడేలా చేస్తుంది. ఏం చేసైనా దాన్ని పొందాలనే కోరిక కలగజేస్తుంది. ఇదే వ్యసనం. చిన్న వయసులో గంజాయి రుచికి అలవడితే వ్యసనంగా మారే అవకాశం రెండు రెట్లు ఎక్కువ!

### అలవాటును అనుమానించేదెలా?

హఠాత్తుగా కొత్త కొత్త పరిచయాలు ఏర్పడటం

ఫోన్‌లో రహస్యంగా, అర్ధరాత్రుల్లో చాటింగ్

శుభ్రతను పట్టించుకోకపోవటం, మురికి దుస్తులను ధరించటం

ఎక్కువగా చిరాకు పడటం, కోపం తెచ్చుకోవటం

గతంలో ఇష్టమైన పనుల మీద ధ్యాస పెట్టకపోవటం

రాత్రనకా పగలకనకా ఎక్కువసేపు స్నేహితులతోనే ఉండిపోవటం

తరచూ ఎర్రబడిన కళ్లతో కనిపించటం

కళ్లు మగతగా, మూతపడినట్టుగా అనిపించటం

దుస్తులు కుళ్లిపోయినట్టుగా ఒకమాదిరి వాసన వేయటం

చర్మం మీద నూనె, టింక్చర్ రాసుకున్నట్టుగా మరకలు

చాటింగ్‌లో షాటర్, డంబ్ వంటి సంకేత పదాలు వాడటం

అసాధారణ మతిమరుపు.

జేబుల్లో, బ్యాగుల్లో పైపులు, లైటర్లు, రోలింగ్ పేపర్ల వంటివి ఉండటం

వేళకాని వేళ ఇంటికి రావటం

మామూలుగా కన్నా అతిగా తినటం


చేతికిచ్చిన డబ్బుకు లెక్క చెప్ప లేకపోవటం, డబ్బులు దొంగిలించటం

కొన్నిసార్లు పెద్దమొత్తంలో డబ్బు ఖర్చుపెట్టటం.

బ్యాంకు ఖాతా లేదా కార్డుల ద్వారా ఎక్కువగా లావాదేవీలు జరగటం.

ఇలాంటివి గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే అనుమానించాలి. వారితో మనసు విప్పి మాట్లాడాలి. అలాగని తగాదా పెట్టుకోవద్దు. అన్నింటికన్నా ఇల్లే సురక్షితమైందనే వాతావరణం సృష్టించాలి. తప్పుడు పనులు చేస్తే జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని అవగతమయ్యేలా చూడాలి. వారు ఎదుర్కొంటున్న సమస్యలేంటో తెలుసుకోవాలి. వాటిని పరిష్కరించటానికి గంజాయి మార్గం కాదని నచ్చజెప్పాలి. నలుగురితో కలవటానికి, ధైర్యంగా మెలగటానికి అది అవసరం లేదని అర్థమయ్యేలా చెప్పాలి. పార్టీల్లో, వేడుకల్లో సంగీతం వింటూ, డ్యాన్స్ చేస్తూ, రుచికరమైన వంటకాలు తింటూ కూడా ఆనందాన్ని పొందొచ్చని.. ఇందుకు మాదక ద్రవ్యాలు మార్గం కాదనే సంగతిని బలంగా, మనసుకు హత్తుకునేలా తెలియజేయాలి. దీంతోనే కొందరు మారొచ్చు.

# వయసు మందకొడి



వయసుతో పాటు కదలికలు, చురుకుదనం తగ్గటం వంటి మార్పులు సహజమే. అయినప్పటికీ ఇందుకు జబ్బులేవైనా కారణమవుతున్నాయేమో చూడటమూ ముఖ్యమే. ఉదాహరణకు– కొద్దికాలంలోనే మందగొడిగా తయారైనా, తీవ్రమవుతున్నా ఆలోచించాల్సిందే. వృద్ధాప్యం ముంచుకొస్తున్నకొద్దీ చురుకైన, సమన్వయంతో కూడిన కదలికల మీద చాలా అంశాలు ప్రభావం చూపుతాయి మరి.

వినికిడి, చూపు, స్పర్శ తగ్గటం: వినికిడి లోపం.. చూపు తగ్గటం, చుట్టుపక్కల దృశ్యాలు సరిగా కనిపించకపోవటం, లోతు తెలియక పోవటం.. చేతులు, పాదాల్లో స్పర్శజ్ఞానం తగ్గటం కదలికల మీద గణనీయమైన ప్రభావం చూపుతాయి.

నాడీ వ్యవస్థ మార్పులు: మెదడు, వెన్నెపాము.. స్పర్శ, చలన నాడులు మారటం మూలంగా విశదీకరణ వేగం నెమ్మదిస్తుంది. అడ్డంకులకు, ఆటంకాలకు ప్రతిస్పందించే సామర్థ్యం తగ్గుముఖం పడుతుంది.

కండర బలం, శక్తి, సాగే గుణం తగ్గటం: వృద్ధులు శరీర నియంత్రణ మీద పట్టు కోల్పోతుంటారు. అటక మీద వస్తువులను పెడుతున్నప్పుడు అవి చేతుల్లోంచి జారిపోవటమూ చూస్తుంటాం. దీనికి కారణం కండరాలు మునుపటిలా ఆయా పనులకు అనుగుణంగా సహకరించకపోవటమే.

తూలిపోవటం: శరీరం స్థిరంగా ఉండే ప్రక్రియ చాలా సున్నితమైంది. ఇందుకు లోపలి చెవి, మెదడులోని భాగాలు సహకరిస్తుంటాయి. వయసు మీద పడుతున్నప్పుడు ఇవి అంత సమర్థంగా పనిచెయ్యవు. దీంతో తూలిపోయే ముప్పు ఎక్కువ.

మందులు: కొన్నిరకాల యాంటీహిస్టమిన్లతో మగత రావటం, కొన్ని రక్తపోటు మందులతో తల తిప్పటం, తేలిపోవటం వంటివీ చురుకుదనం తగ్గేలా చేయొచ్చు.

ఏకాగ్రత కొరవడటం: దీని మూలంగా వస్తువులు జారిపోవటం, దేనికో ఒకదానికి ఢీకొనటం, కింద పడిపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి.

జబ్బుల ప్రభావం: కీళ్లనొప్పి, మధుమేహం, పార్కిన్సన్స్ వంటి దీర్ఘకాల జబ్బులూ మందకొడితనం మరింత ఎక్కువయ్యేలా చేస్తాయి.

## జాగ్రత్తలు అవసరం

వయసుతో పాటు తలెత్తే ఇలాంటి మార్పుల్లో చాలావాటిని వెనక్కి తిప్పటం సాధ్యం కాదు. అయినప్పటికీ చురుకుదనం పెంచుకోవటానికి, గాయాలు కాకుండా చూసుకోవటానికి మార్గాలు లేకపోలేదు.

చేతి పట్టు బలాన్ని పెంచుకోవటానికి, చలన నైపుణ్యాలను మెరుగుపరచుకోవటానికి ప్రయత్నించాలి. టెన్నిస్ బంతిని రోజుకు రెండు, మూడు సార్లు నొక్కటం.. తరచూ వేళ్లను మృదువుగా సాగదీయటం.. చొక్కా గుండీలను పెట్టటం, తీయటం.. జిగ్‌సా పజిళ్లు పూరించటం వంటివి ఇందుకు తోడ్పడతాయి.

శారీరకంగా చురుకుగా ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వీటిల్లో శరీరాన్ని స్థిరంగా ఉంచటానికి తోడ్పడే యోగా వంటివీ ఉండేలా చూసుకోవాలి. వారానికి రెండు మూడు సార్లు రబ్బరు పట్టీలను లాగటం వంటివీ చేయాలి. ఇవి కండరాలు బలంగా ఉండటానికి తోడ్పడతాయి. గాఢ నిద్రకు ప్రాధాన్యమివ్వాలి. ఎందుకంటే కంటి నిండా నిద్ర పట్టకపోతే ఏకాగ్రత, స్థిరత్వం తగ్గుతాయి. దీంతో మందకొడితనం ఎక్కువయ్యే అవకాశముంది.



# కూర్చొని చేసే ఈ సింపుల్ ఎక్సర్‌సైజ్‌తో భోజనం తర్వాత షుగర్ స్పైక్స్‌కు చెక్!

**భోజనం తర్వాత షుగర్ పెరగడం సహజం**

**సోలియస్ పుష్–అప్ సులభమైన వ్యాయామం**

**చక్కెర పెరుగుదల 52 శాతం తగ్గొచ్చు**

**ఇన్సులిన్ స్పందన కూడా తగ్గే అవకాశం**

**60 నుంచి 90 నిమిషాల తర్వాత చేయాలి**

**నడవలేని వారికి మంచి ప్రత్యామ్నాయం**

భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం సహజం. కానీ అవి తరచూ ఎక్కువగా ఉంటే ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, కంటి ఇబ్బందుల ప్రమాదం పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితిని తగ్గించేందుకు నడక ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే అందరికీ ప్రతిసారి నడిచే అవకాశం ఉండదు.

అలాంటి వారికి సులభమైన మార్గంగా ‘సోలియస్ పుష్–అప్’ ఉపయోగపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది కాళ్ల మడమలను పైకి కిందికి కదిలించే చిన్న వ్యాయామం. కుర్చీలో కూర్చునే దీన్ని చేయొచ్చు. ఆఫీసులో పని చేస్తూ కూడా సాధ్యమే. ప్రత్యేక పరికరాలు అవసరం ఉండవు.

## చక్కెర స్థాయులపై ప్రభావం

‘ఱూఎఱఅవఅఎవ’ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం ఈ వ్యాయామం భోజనం తర్వాత వచ్చే బ్లడ్ షుగర్ పెరుగుదలను 52 శాతం వరకు తగ్గించగలదు. ఇన్సులిన్ ప్రతిస్పందనను 60 శాతం వరకు తగ్గించే అవకాశం కూడా ఉందని పరిశోధకులు గుర్తించారు. కాలి కండరాలు పనిచేసే సమయంలో రక్తంలో ఉన్న గ్లూకోజ్‌ను ఎక్కువగా వినియోగిస్తాయి. దీంతో చక్కెర స్థాయులు అదుపులో ఉండేందుకు సహాయపడుతుంది.

## ఎప్పుడు చేయాలి?

భోజనం ముగిసిన 60 నుంచి 90 నిమిషాల మధ్య ఈ వ్యాయామం చేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలోనే సాధారణంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయులు గరిష్ఠానికి చేరుతాయి. ఆ సమయంలో కాలి కండరాలను కదిలిస్తే మంచి ఫలితం కనిపించవచ్చు. రోజూ అలవాటు చేసుకుంటే మరింత ఉపయోగం ఉంటుంది.

## ఎలా చేయాలి?

కుర్చీలో నిటారుగా కూర్చోవాలి. మోకాళ్లు 90 డిగ్రీల కోణంలో ఉండాలి. పాదాల ముందు భాగం నేలపై అలాగే ఉంచాలి. తర్వాత మడమలను వీలైనంత ఎత్తుకు పైకి లేపాలి. మళ్లీ నెమ్మదిగా కిందకు దించాలి. వేగంగా చేయకుండా ఒకే రిథమ్‌లో కొనసాగించాలి. ఇలా 10 నుంచి 15 నిమిషాల పాటు చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. టీవీ చూస్తున్నప్పుడు, కంప్యూటర్ ముందు పనిచేస్తున్నప్పుడు కూడా చేయొచ్చు. శరీరానికి ఎక్కువ అలసట రాదు. అందుకే వయసుతో సంబంధం లేకుండా చాలా మంది దీన్ని ప్రయత్నించొచ్చు.

## సోలియస్ కండరం ప్రత్యేకత

మన కాలి వెనుక భాగంలో ఉండే సోలియస్ కండరం సాధారణ కండరాల కంటే భిన్నంగా పనిచేస్తుంది. ఇది శక్తి కోసం శరీరంలో నిల్వ ఉన్న గ్లైకోజన్‌పై ఎక్కువగా ఆధారపడదు. రక్తంలో ఉన్న చక్కెర, కొవ్వులను ఆక్సిజన్ సాయంతో వినియోగించుకుంటుంది. అందుకే ఎక్కువసేపు పని చేసినా త్వరగా అలసిపోదు.

## నడకకు ప్రత్యామ్నాయం కాదు

భోజనం తర్వాత 10 నిమిషాల నడక ఎప్పటికీ అత్యుత్తమ మార్గమేనని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే నడకలో శరీరంలోని పెద్ద కండరాల సమూహాలు పనిచేస్తాయి. అయితే బయటకు వెళ్లే అవకాశం లేని సమయంలో సోలియస్ పుష్–అప్ మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. చిన్న కదలికతోనే ఆరోగ్యానికి మేలు చేసే అలవాటుగా దీన్ని భావిస్తున్నారు.

# ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్, కోహ్లీ కీలకం: ఇర్ఫాన్ పఠాన్

ప్రపంచకప్‌లో భారత్‌కు రోహిత్, కోహ్లీ అనుభవం కీలకమన్న ఇర్ఫాన్ పఠాన్

దక్షిణాఫ్రికాలో రోహిత్ షార్ట్‌పిచ్ బంతులను సమర్థంగా ఎదుర్కోగలడని విశ్లేషణ

వన్డేల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో కోహ్లీకి సాటే లేదని అభిప్రాయం

వికెట్‌కీపర్‌గా కేఎల్ రాహుల్ తర్వాత ఇషాన్ కిషన్ బ్యాకప్ అని పేర్కొన్న పఠాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయావకాశాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటాయని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డేకు ముందు మాట్లాడిన అతడు ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లు జట్టుకు అందించే స్థిరత్వం, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం విలువైనవని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వంటి భారీ టోర్నీల్లో అనుభవజ్ఞుల పాత్ర ఎంత ముఖ్యమో భారత్ గతంలో పలుమార్లు చూసిందని గుర్తు చేశాడు. రోహిత్ శర్మ గురించి మాట్లాడిన పఠాన్, అతని షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే నైపుణ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై వేగం, బౌన్స్ ఎక్కువగా ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో రోహిత్ వంటి బ్యాటర్ ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చెలాయించగలడని అన్నాడు. బాల్ లెంగ్త్‌ను ముందుగానే అంచనా వేసి ఆడే అతని సామర్థ్యం భారత జట్టుకు పెద్ద బలమని వివరించాడు.

విరాట్ కోహ్లీ విషయానికి వస్తే వన్డే క్రికెట్‌లో అతని స్థిరత్వానికి సాటే లేదని పఠాన్ పేర్కొన్నాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే కోహ్లీ తొలి వికెట్ త్వరగా పడినప్పుడు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగలడని చెప్పాడు. భారీ లక్ష్యాల ఛేదనలో కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడని వివరించాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడే అతని స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపాడు. ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్ దూకుడు, కోహ్లీ నిలకడ రెండూ భారత్‌కు తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశాడు. ఇక వికెట్‌కీపర్ బ్యాటర్ల ఎంపికపై కూడా పఠాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. వన్డేల్లో కేఎల్ రాహుల్ భారత జట్టు తొలి ఎంపిక వికెట్‌కీపర్ బ్యాటర్ అని చెప్పాడు. ఐదు, ఆరు స్థానాల్లో అతను జట్టుకు బ్యాలెన్స్‌ను అందించగలడని వివరించాడు. బ్యాకప్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని తెలిపాడు. ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం అతనికి ఉందని తెలిపాడు. అలాగే అవకాశం వచ్చిన ప్రతిసారీ సత్తా చాటిన సంజూ శాంసన్‌ను కూడా పరిశీలించొచ్చని సూచించాడు.

# 90 నిమిషాల ఆట.. వేల కోట్ల సంపాదన.. ఇది క్రిస్టియానో రొనాల్డో లెక్క!

**ఒక్క మ్యాచ్ ఆడితే రొనాల్డో సంపాదన సుమారు 30 కోట్లు**

**ఈ మొత్తం సంపాదించడానికి ఓ భారతీయ ఉద్యోగికి 2,500 ఏళ్లు**

**సౌదీ క్లబ్‌తో ఒప్పందం ద్వారా రొనాల్డో వార్షిక ఆదాయం 1,700 కోట్లకు పైమాటే**

**రొనాల్డో నికర ఆస్తి విలువ సుమారు 10,000 కోట్ల రూపాయలు**

**ఈ సంపదను అందుకోవాలంటే ఏడాదికి 12 లక్షల జీతంతో 83,000 ఏళ్లు పనిచేయాలి**



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఇక జీతం అనే మాట చిన్నదైపోయింది. అతను ఇప్పుడు సమయాన్ని శాసించే స్థాయిలో సంపాదిస్తున్నాడు. ఫుట్‌బాల్ మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారీ, కాలం అతని కోసం ప్రత్యేకంగా నడుస్తుంది. కేవలం 90 నిమిషాల ఆట అతనికి దాదాపు 30 కోట్ల రూపాయలు సంపాదించి పెడుతుంది. ఇదే మొత్తాన్ని ఏడాదికి 12 లక్షల రూపాయల జీతం తీసుకునే ఓ భారతీయ ఉద్యోగి సంపాదించాలంటే ఏకంగా 2,500 సంవత్సరాలు పడుతుంది. ఎన్డీటీవీలో వచ్చిన కథనం ప్రకారం.. ఈ లెక్కలు ఎలా సాధ్యమో వివరంగా చూద్దాం. ప్రస్తుతం 41 ఏళ్ల వయసులో ఉన్న రొనాల్డో, సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తో చేసుకున్న ఒప్పందం ద్వారా ఏడాదికి సుమారు 200 మిలియన్ డాలర్లు ఆర్జిస్తున్నాడు. భారత కరెన్సీలో ఇది సుమారు 1,700 కోట్ల రూపాయలతో సమానం. ఒక ఫుట్‌బాల్ సీజన్‌లో క్లబ్, జాతీయ జట్టు తరఫున రొనాల్డో సగటున 55 మ్యాచ్‌లు ఆడతాడని అంచనా. ఈ లెక్కన అతని వార్షిక ఆదాయాన్ని మ్యాచ్‌ల సంఖ్యతో భాగిస్తే, ప్రతి మ్యాచ్‌కు అతని సంపాదన దాదాపు 30 కోట్ల రూపాయలని తేలుతుంది. అంటే.. 90 నిమిషాల ఆట, అదనపు సమయం కలిపి అతనికి వచ్చే ఆదాయం, మన దేశంలోని ఎన్నో కంపెనీలు తమ ఉద్యోగులందరికీ ఏడాది జీతాల కోసం కేటాయించే బడ్జెట్‌తో సమానం. ఇది కేవలం అతని వార్షిక ఆదాయం మాత్రమే. ఇక అతని నికర ఆస్తి విలువ చూస్తే కళ్లు చెదరడం ఖాయం. ప్రస్తుతం రొనాల్డో ఆస్తి విలువ 1.2 బిలియన్ డాలర్లకు పైనే ఉంటుందని అంచనా. మన కరెన్సీలో చెప్పాలంటే ఇది సుమారు 10,000 కోట్ల రూపాయలు. రెండు దశాబ్దాలకు పైగా అగ్రశ్రేణి ఫుట్‌బాల్ ఆడటం, ఛాంపియన్స్ లీగ్ బోనస్‌లు, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, ఇమేజ్ రైట్స్, సొంత వ్యాపారాలు, ప్రపంచంలోని ఎన్నో దేశాల జనాభా కంటే ఎక్కువ ఉన్న సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను ఆదాయంగా మార్చుకోవడం ద్వారా ఈ అపార సంపదను కూడబెట్టాడు. ఇప్పుడు ఈ 10,000 కోట్ల రూపాయల సంపదను, ఏడాదికి 12 లక్షలు

సంపాదించే భారతీయ ఉద్యోగితో పోల్చి చూద్దాం. రొనాల్డో ఆస్తిని అందుకోవాలంటే.. ఆ ఉద్యోగికి దాదాపు 83,333 సంవత్సరాలు పడుతుంది. మరోలా చెప్పాలంటే.. ఒక వ్యక్తి తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎంత సంపాదించినా అది రొనాల్డో సంపద ముందు సముద్రంలో నీటిబొట్టు లాంటిదే. దాదాపు 2,000కు పైగా ఉద్యోగ జీవితాలను పక్కపక్కన పెడితే గానీ ఆ సంపదను అందుకోలేరు. ఫుట్‌బాల్, గ్లామర్, ట్రోఫీలు, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్‌ను పక్కనపెట్టి కేవలం అంకెలను చూస్తే, అసలు కథ బోధపడుతుంది. ఆధునిక ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక వ్యక్తి 90 నిమిషాల సమయం, వేలాది మంది సంవత్సరాల తరబడి చేసే ఉద్యోగానికి సమానంగా నిలుస్తోంది. ఇదే క్రిస్టియానో రొనాల్డో సృష్టించిన ఆర్థిక అద్భుతం.

# ‘సింగ్ గీతం’ మార్క్ మ్యాజిక్ ఇక ప్రేక్షకుల చేతుల్లోనే!



**రుహాని శర్మ: టాలీవుడ్ బహుముఖ నటి - ఆకర్షణీయమైన తేజస్సు**



ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ గ్లోబల్ స్థాయిలో దూసుకుపోతోంది. భారీ బడ్జెట్ చిత్రాలు, కమర్షియల్ హంగులతో కూడిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. మరోవైపు వైవిధ్యమైన కథాంశాలతో వచ్చే ప్రయోగాత్మక చిత్రాలకు కూడా అంతే స్థాయిలో ఆదరణ లభించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలోనే ఇండస్ట్రీ లో సరికొత్త చర్చకు తెర తీసింది -సింగ్ గీతం- అనే ఒక ఆసక్తికరమైన కాన్సెప్ట్. రొటీన్ మాస్ మసాలా ఫార్ములాకు భిన్నంగా.. సరికొత్త కథనంతో 94 ఏళ్ల దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరవు రూపొందించిన చిత్రమిది.

తెలుగు పరిశ్రమకు ప్రయోగం అనే మాటను పరిచయం చేసిన ఓ లెజెండ్ డైరెక్ట్ చేసిన చిత్రం కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇలాంటి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు మనస్ఫూర్తిగా ఆదరించాలని సినీ విశ్లేషకులు అంతే భావిస్తున్నారు. సాధారణంగా తెలుగు ప్రేక్షకులు సినిమాను కేవలం వినోద సాధనంగానే కాకుండా ఒక పండుగలా భావిస్తారు. అయితే పెద్ద స్టార్లు.. వారు క్రియేట్ చేసే హడావుడి నడుమ చిన్న సినిమాలు .. వినూత్నమైన టైటిల్స్, విభిన్నమైన కాన్సెప్టులతో వచ్చే చిత్రాలు ఒక్కోసారి సరైన గుర్తింపునకు నోచుకోలేకపోతున్నాయి.

కంటెంట్‌లో ఎంత దమ్మున్నా? స్టార్ పవర్ లేకపోవడం వల్ల చిత్రాలు థియేటర్లలో నిలదొక్కుకోవడం సవాలుగా మారుతోంది. అందుకే కమర్షియల్ ఇమేజ్ పక్కన పెట్టి కేవలం కథను నమ్మి వచ్చే ఇలాంటి సరికొత్త ప్రయత్నాలకు ప్రేక్షకుల మద్దతు ఎంతో అవసరం. -సింగ్ గీతం- వంటి చిత్రాల వెనుక ఎంతో మంది నూతన నటీనటులు, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుల కష్టం దాగి ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త తరం మేకర్స్ సరిహద్దులను బ్రేక్ చేస్తూ వినూత్న ప్రమాణాలతో కూడిన కథలను టచ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇలాంటి ప్రయోగాలను తెలుగు ఆడియన్స్ మునుపెన్నడూ లేనంతగా ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది. సినిమా బాగుంటే భాషతో లేదా బడ్జెట్‌తో సంబంధం లేకుండా బ్రహ్మరథం పట్టే తెలుగు ఇండస్ట్రీ వైవిధ్యమైన చిత్రానికి కూడా అదే తరహా వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రేక్షకుల అభిరుచి చాలా వరకు మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్నమైన కంటెంట్‌ను ఓటీటీల లో వీక్షిస్తూ సినిమా పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. కానీ ఆ మార్పు కేవలం డిజిటల్ స్క్రీన్లకే పరిమితం కాకుండా థియేటర్ల వద్ద కూడా కనిపించాలి. -సింగ్ గీతం- వంటి సినిమాల్లో ఉండే ఫ్రెష్ థాట్స్, కొత్త తరహా మేకింగ్‌ను థియేటర్లలోనే ఎంజాయ్ చేసినప్పుడే, మేకర్స్‌కు మరింత ఉత్సాహం లభిస్తుంది. కేవలం పెద్ద సినిమాలకే థియేటర్లు అనే అపోహను వీడి ఇలాంటి కంటెంట్-ఓరియెంటెడ్ సినిమాలకు కూడా ఓపెనింగ్స్ అందించేలా తెలుగు ఆడియన్స్ అడుగులు వేయాలి. ఒక పరిశ్రమ ఆరోగ్యకరంగా ఎదగాలంటే అక్కడ కమర్షియల్ హిట్స్ ఎంత అవసరమో? సమాంతరంగా ప్యారలల్ సినిమా .. ప్రయోగాత్మక చిత్రాల విజయం కూడా అంతే ముఖ్యం.

-సింగ్ గీతం- చిత్రానికి లభించే ఆదరణ కేవలం ఆ ఒక్క సినిమా విజయానికే పరిమితం కాదు. భవిష్యత్తులో మరెంతో మంది యువ దర్శకులు సరికొత్త ఆలోచనలతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి ఓ ధైర్యాన్ని ఇస్తుంది. రిస్క్ అని తెలిసినా కొత్తదనాన్ని నమ్ముకుని సినిమా తీసే నిర్మాతలకు ఈ విధమైన ప్రోత్సాహం ఆర్థికంగా .. మానసికంగా ఎంతో భరోసానిస్తుంది.



**మేధా శంకర్ మిడ్‌నైట్ మ్యాజిక్ & రైజింగ్ బాలీవుడ్ స్టార్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965